సంపుటి : 9
సంచిక : 321
గురువారం
13 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

## గణాంకాలు ఏమంటున్నాయి?

- దేశవ్యాప్తంగా మొత్తం సిజేరియన్లు **27.2%**
- దేశంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లు **54.1%**
- తెలంగాణలో మొత్తం **62.2%**
- తెలంగాణ ప్రైవేటు ఆసుపత్రుల్లో **83.9%**
- ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం **52.2%**
- ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఆసుపత్రుల్లో **66.2%**
- తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రుల్లో **48.1%**
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు **38%**

(గమనిక: NFHS-6, 2023-24)

# మాతృత్వంపై 'కత్తి' నీడ!



## తెలంగాణ ప్రైవేటు ఆస్పత్రుల్లో 83.9% శస్త్ర ప్రసవాలే!

### ఆంధ్రప్రదేశ్‌లోనూ 66.2 శాతం.. సహజ ప్రసవాల కంటే శస్త్ర ప్రసవాల వైపే భారీ మొగ్గు

- వైద్య అవసరమా? ముందస్తు ప్రణాళికా? అధిక శాతంపై సమగ్ర వైద్య తనిఖీలకు పెరుగుతున్న డిమాండ్
- ప్రతి గర్భిణీకి అవసరాన్ని బట్టి నిర్ణయం ఉండాలి అంటున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ
- ఆసుపత్రుల వారీగా డేటా బహిర్గతం చేయాలి, అనవసర శస్త్ర ప్రసవాలకు అడ్డుకట్ట వేయాలి అంటున్న నిపుణులు

హైదరాబాద్ / అమరావతి - విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి

బిడ్డ పుట్టడం ప్రతి కుటుంబంలో అపూర్వమైన ఆనంద ఘట్టం. తొమ్మిది నెలలు మోసిన తల్లి కళ్లముందు తన బిడ్డను చూసే ఆ క్షణం జీవితాంతం గుర్తుండిపోతుంది. అయితే తెలుగు రాష్ట్రాల్లో ప్రసవాల తీరును వెల్లడిస్తున్న తాజా గణాంకాలు మాత్రం మాతృత్వం చుట్టూ మరో తీవ్రమైన చర్చకు తెరతీస్తున్నాయి. సహజ ప్రసవాలతో పోలిస్తే శస్త్ర ప్రసవాల శాతం భారీగా పెరుగుతోంది. ముఖ్యంగా ప్రైవేటు వైద్య సంస్థల్లో నమోదవుతున్న సిజేరియన్ శాతం దేశ సగటును మించిపోవడం అనేక ప్రశ్నలను ముందుకు తెస్తోంది. అన్ని శస్త్ర ప్రసవాలూ అనవసరమని చెప్పడానికి వీల్లేదు. తల్లి లేదా బిడ్డ ప్రాణాలకు ప్రమాదం ఉన్న సమయంలో సిజేరియన్ అత్యంత కీలకమైన ప్రాణరక్షక వైద్య విధానం. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రతి పది ప్రసవాల్లో ఎనిమిది, తొమ్మిది వరకు శస్త్రచికిత్సలే నమోదవుతున్నప్పుడు వైద్య అవసరం ఎంత?.. ఇతర కారణాల ప్రభావం ఎంత? అన్న ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఏర్పడుతోంది.

**తెలంగాణలో ప్రతి 100 ప్రసవాల్లో 62 శస్త్రచికిత్సలే!**

తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 (2023-24) గణాంకాలు తెలంగాణలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. రాష్ట్రంలోని మొత్తం ప్రసవాల్లో 62.2 శాతం సిజేరియన్ విధానంలో జరిగినట్లు నమోదైంది. ప్రైవేటు వైద్య సంస్థలను మాత్రమే పరిశీలిస్తే ఈ శాతం

మిగతా .. 2లో..

### రాష్ట్రాల వారీగా సిజేరియన్ రేట్లు (NFHS-6, 2023-24)

| ప్రాంతం | మొత్తం ప్రసవాల్లో సిజేరియన్ శాతం | ప్రైవేటు వైద్య సంస్థల్లో | ప్రభుత్వ వైద్య సంస్థల్లో |
|---|---|---|---|
| భారతదేశం | 27.2% | 54.1% | 16.9% |
| తెలంగాణ | 62.2% | 83.9% | 48.1% |
| ఆంధ్రప్రదేశ్ | 52.2% | 66.2% | సుమారు 38% |

### తెలంగాణ జిల్లాలు – ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ రేట్లు (NFHS-5)

- కరీంనగర్ – 92.8%
- మంచిర్యాల – 92.6%
- రాజన్న సిరిసిల్ల – 90.9%
- నిర్మల్ – 90.3%
- నిజామాబాద్ – 90%
- నల్లగొండ – 90%
- వరంగల్ అర్బన్ – 87.9%
- జనగామ – 86%
- హైదరాబాద్ – 85%

(NFHS-5 జిల్లా గణాంకాలు ప్రస్తుత పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చు)

### ఆంధ్రప్రదేశ్ జిల్లాలు – ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ రేట్లు (NFHS-5)

- కృష్ణా – 79.7%
- శ్రీకాకుళం – 73.8%
- గుంటూరు – 72.2%
- తూర్పు గోదావరి – 72%
- పశ్చిమ గోదావరి – 72%
- విజయనగరం – 70.3%
- కర్నూలు – 64.5%
- ప్రకాశం – 61%

(NFHS-5 జిల్లా గణాంకాలు ప్రస్తుత పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చు)

### అధిక సిజేరియన్ల వెనుక కారణాలేంటి?

- **ముహూర్తాల మోజు** – పుట్టే తేది, సమయం, నక్షత్రం కోసం ముందస్తుగా ఆపరేషన్ కోరిక
- **ప్రసవ వేదనపై భయం** – నొప్పులు భరించలేక శస్త్ర ప్రసవాన్ని కోరుకుంటున్న గర్భిణులు
- **ముందస్తు ప్రణాళిక సౌకర్యం** – ఆసుపత్రులకు, డాక్టర్లకు సమయం, వనరుల నిర్వహణ సులభత
- **వ్యాపార దృష్టి?** – సహజ ప్రసవాల కంటే శస్త్ర ప్రసవాల పై అధిక ఆదాయర్హ ఆరోపణలు

### WHO ఏమంటోంది?

అవసరమైనప్పుడు ప్రతి మహిళకు సిజేరియన్ అందుబాటులో ఉండాలి. జనాభా స్థాయిలో సిజేరియన రేటు 10% వరకు పెరిగే కొద్దీ తల్లి, శిశు మరణాలు తగ్గుతాయి. అయితే ఆ స్థాయిని దాటిన తర్వాత లాభాలు స్పష్టంగా లేవు.

– ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)

### ప్రభుత్వం అడగాల్సిన 7 ప్రశ్నలు

1. ఒక్కో ఆసుపత్రులో సిజేరియన్ శాతం ఎంత?
2. రాష్ట్ర సగటు కంటే రెండింతలు ఉన్న ఆసుపత్రులు ఎన్ని?
3. ప్రతి ఆపరేషన్‌కు వైద్య కారణం నమోదు చేస్తున్నారా?
4. మొదటి సిజేరియన్లు ఎందుకు పెరుగుతున్నాయి?
5. సహజ ప్రసవాలకు అవసరమైన వైద్య సిబ్బంది ఉన్నారా?
6. ప్రసవ ప్యాకేజీల ధరల్లో పారదర్శకత ఉందా?
7. అధిక సిజేరియన ఆసుపత్రులపై చివరిసారి ఆడిట్ ఎప్పుడు జరిగింది?

**కావాల్సింది సిజేరియన్ వ్యతిరేకత కాదు... అనవసర శస్త్రచికిత్సలకు అడ్డుకట్ట! | మాతృత్వం వ్యాపార నిర్ణయంగా కాకుండా... తల్లి-బిడ్డ భద్రతే కేంద్రంగా ఉండాలి.**

---

నిబంధనల మేరకు విద్యార్థులకు

## పోషకాహారం అందించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి



రాజమహేంద్రవరం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ : రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలోని గిరిజన, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి బుధవారం తనిఖీ

మిగతా .. 2లో..

రాజ్యాంగ విలువలు తెలియని వ్యక్తి అమరావతిని మావిగన్‌గా

## మార్చాలనుకుంటున్నారు

తెదేపా ఎంపీ చింతకాయల విజయ్



దిల్లీ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : "కేరళ దేవతల రాష్ట్రంగా పేరు పొందితే, అమరావతి దేవతల రాజధానిగా వాసికెక్కింది. ఇప్పుడు కేరళ పేరును కేరళంగా మార్చి కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయాలను

మిగతా .. 2లో..

నేరాల రూపం మారింది...

# పోలీసింగ్ మారాలి

- క్రైమ్ దర్యాప్తులో గోల్డెన్ అవర్ కీలకం
- ఏపీ పోలీస్ కీర్తి దేశమంతా మార్మోగాలి
- రాష్ట్రంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం
- ఇక ప్రతీ నెలా పోలీస్ పెర్ఫార్మెన్స్ రిపోర్టు
- పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలతోనే ఇబ్బందులు
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే కఠినంగా ఉండండి
- రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ పోలీసు అధికారులతో సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల రూపం కూడా మారిపోయిందని.. దీనికి అనుగుణంగానే పోలీసింగ్ మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో తక్షణం ఆధారాలు కోల్పోకుండా చూడాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేర నియంత్రణలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని ఆయన అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి డీజీపీ నుంచి క్షేత్ర స్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సీఎం సమావేశం నిర్వహించారు. డీజీపీ సహా రేంజ్ ఐజీలు, డీఐజీలు, డీఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. ఏపీ పోలీసుల కీర్తి దేశమంతా

మిగతా .. 2లో..

లిథియం, గాలియం నిక్షేపాల అన్వేషణపై

## ఎన్జీఆర్ఐతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ



అమరావతి, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో కీలక ఖనిజాల అన్వేషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కడప బేసిన్ పరిధిలోని వేంపల్లె పరిసరాల్లో లిథియం, గాలియం ఖనిజాల నిక్షేపాలపై విస్తృత స్థాయి అన్వేషణకు చర్యలు చేపడుతోంది. ఈ మేరకు సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్

మిగతా .. 2లో..

సభకు రానివాళ్లు

## ఎమ్మెల్యేలుగా ఎందుకు?

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



అమరావతి, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అసెంబ్లీ ప్రాంగణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు ఆయన

మిగతా .. 2లో..




గోదావరి జలాలను

## గరిష్ఠస్థాయిలో వినియోగించుకోవాలి

తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు నీటిని ఎత్తిపోయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. ఎన్డీఎస్ఏ సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు

మిగతా .. 2లో..

## పాడేరు డీఎస్పీ, కుటుంబసభ్యులపై కేసు

నరసరావుపేట, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : పాడేరు డీఎస్పీ వెన్నా రాజసింహారెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. డీఎస్పీ హోదాతో రాజసింహారెడ్డి పలువురిని బెదిరించినట్లు అభియోగాలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. నరసరావుపేట మండలం రావిపాడులో తమ పొలాన్ని డీఎస్పీ వెన్నా రాజసింహారెడ్డి సేల్ అగ్రిమెంట్ చేశారు. రూ.67 లక్షలు తీసుకుని డీఎస్పీ, ఆయన సోదరుడు రిజిస్ట్రేషన్ చేయలేదు. భూమి ధర

మిగతా .. 2లో..

మాజీ మంత్రి అంబటి సహా

## వైకాపా నేతలపై కేసు నమోదు



గుంటూరు, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : వైకాపా నేత అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూరి ఫాతిమా తదితరులపై గుంటూరు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఈనెల 10న శంకరవిలాస్ సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇందుకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ 30 పోలీస్ యాక్ట్ నిబంధనలు అతిక్రమించి ప్రజా రవాణా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారు. ర్యాలీకి అనుమతి లేదని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని పోలీసులు చెబుతున్నా లెక్క చేయకుండా ప్రదర్శన

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# మాతృత్వంపై 'కత్తి' నీడ!

మరింత పెరిగి 83.9 శాతానికి చేరింది. అంటే తెలంగాణలో ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే ప్రతి 100 ప్రసవాల్లో దాదాపు 84 ప్రసవాలు శస్త్రచికిత్స ద్వారానే జరుగుతున్నాయన్న మాట. ప్రభుత్వ వైద్య సంస్థల్లోనూ సిజేరియన్ రేటు 48.1 శాతంగా నమోదవడం గమనార్హం.

**ఆంధ్రప్రదేశ్‌లోనూ సగానికి మించినవే..**

ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 ప్రకారం రాష్ట్రంలోని మొత్తం ప్రసవాల్లో 52.2 శాతం సిజేరియన్లు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ రేటు 66.2 శాతంగా ఉండగా, ప్రభుత్వ వైద్య సంస్థల్లో సుమారు 38 శాతంగా నమోదైంది. అంటే ఏపీలో ప్రైవేటు వైద్య సంస్థల్లో జరిగే ప్రతి మూడు ప్రసవాల్లో దాదాపు రెండు శస్త్ర ప్రసవాలే. దేశవ్యాప్తంగా మొత్తం సిజేరియన్ రేటు 27.2 శాతం, ప్రైవేటు వైద్య సంస్థల్లో 54.1 శాతం ఉండగా రెండు తెలుగు రాష్ట్రాలు ఈ సగటును దాటడం గమనించాల్సిన అంశం.

**జిల్లాల్లో మరింత తీవ్ర చిత్రం**

జిల్లాల వారీ తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 పూర్తి పట్టికలు ప్రజలకు స్పష్టంగా అందుబాటులో లేకపోవడంతో, జిల్లా స్థాయి పోలికకు గత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 గణాంకాలే ఇప్పటికీ ప్రధాన అధికారిక సూచికగా ఉన్నాయి. ఆ గణాంకాల్లో తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ప్రైవేటు ఆస్పత్రుల సిజేరియన్ రేట్లు అత్యంత ఎక్కువగా నమోదయ్యాయి.

**వైద్యం అవసరమేనా?..**

ఇక్కడ అత్యంత ముఖ్యమైన అంశం ఇదే. అధిక శాతం నమోదైనంత మాత్రాన ప్రతి సిజేరియన్ అనవసరమని చెప్పడం వైద్యపరంగా సరైంది కాదు. శిశువు గుండె స్పందనలు తగ్గడం, ప్రసవం ముందుకు సాగకపోవడం, ప్లాసెంటా సమస్యలు, తల్లి ఆరోగ్య పరిస్థితి, శిశువు స్థానం, గత ప్రసవాల్లో సిజేరియన్ చరిత్ర, అధిక రక్తపోటు వంటి అనేక పరిస్థితుల్లో శస్త్ర ప్రసవం తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడుతుంది. అయితే ప్రతి పది ప్రసవాల్లో ఎనిమిది, తొమ్మిది శస్త్ర ప్రసవాలుగా నమోదవుతున్న ఆస్పత్రుల్లో ప్రతి శస్త్రచికిత్స వెనుక వైద్య కారణం ఏమిటి? అన్నదానిపై స్వతంత్ర వైద్య ఆడిట్ జరగాలన్న అభిప్రాయం బలపడుతోంది.

**ముహూర్తాల మోజు కూడా కారణమా?**

వైద్య కారణాలతో పాటు కొన్ని సామాజిక అంశాలు కూడా శస్త్ర ప్రసవాల పెరుగుదలపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయం వైద్య వర్గాల్లో ఉంది. బిడ్డ నిర్దిష్ట తేదీన, నిర్దిష్ట సమయంలో పుట్టాలని కోరుకోవడం, మంచి నక్షత్రం లేదా ముహూర్తం చూసుకోవడం, ప్రసవ వేదనపై భయం, ముందుగానే ప్రసవ తేదీని నిర్ణయించుకోవాలనే కుటుంబాల అభిలాష వంటి అంశాలు కొన్ని సందర్భాల్లో నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చు. అయితే ఇవే అన్ని సిజేరియన్లకు కారణమని సాధారణీకరించడం సరైంది కాదు.

**ఆస్పత్రులకు సౌకర్యమే కారణమా?**

సహజ ప్రసవం ఎప్పుడు జరుగుతుందో ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. వైద్యులు, నర్సులు గంటల తరబడి పర్యవేక్షించాల్సి రావచ్చు. దానికి భిన్నంగా ముందుగా నిర్ణయించిన శస్త్ర ప్రసవంలో సమయం, వైద్య బృందం, ఆపరేషన్ గది తదితరాలను ముందుగానే సమన్వయం చేసుకోవచ్చు. ఇలాంటి నిర్వహణ సౌలభ్యం కూడా కొన్ని సందర్భాల్లో శస్త్ర ప్రసవాల నిర్ణయాలను ప్రభావితం చేస్తుందా అనే అంశంపై మరింత పరిశోధన అవసరం.

**'ప్యాకేజీ'లపై ప్రశ్నలు**

ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవం, సిజేరియన్, గది అద్దె, వైద్యుల రుసుములు, మందులు, పరీక్షలు, నవజాత శిశు సంరక్షణ తదితర ఖర్చుల్లో భారీ వ్యత్యాసాలు కనిపిస్తుంటాయి. కొన్ని కుటుంబాలు ప్రసవానికి ముందే ఒక మొత్తం చెప్పి, తర్వాత మందులు, పరీక్షలు, శిశు సంరక్షణ పేరుతో అదనపు బిల్లులు వస్తున్నాయని ఫిర్యాదు చేస్తుంటాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఒకే విధంగా అధిక మొత్తాలు వసూలు చేస్తున్నాయని ఆధారాలు లేకుండా నిర్ధారించడం సముచితం కాదు. అందుకే ప్రతి ఆస్పత్రి సహజ ప్రసవం, సిజేరియన్‌కు సంబంధించిన పూర్తి ధరల పట్టికను ముందుగానే బహిరంగంగా ప్రకటించాలి అనే డిమాండ్ ముందుకు వస్తోంది.

**ఆంధ్రప్రదేశ్‌లో తనిఖీల దిశగా అడుగులు**

అధిక సిజేరియన్ రేట్లు నమోదవుతున్న ఆస్పత్రులను గుర్తించి వైద్యపరమైన పరిశీలన జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు సూచించినట్లు నివేదికలు వెలువడ్డాయి. కొన్ని ప్రైవేటు వైద్య సంస్థల్లో అత్యంత అధికంగా సిజేరియన్లు నమోదవుతున్న నేపథ్యంలో ప్రసవ రికార్డులు, శస్త్రచికిత్సకు చూపిన వైద్య కారణాలను పరిశీలించాల్సిన అవసరంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇలాంటి ఆడిట్‌లు నిరంతర ప్రక్రియగా మారితేనే అవసరం లేని శస్త్రచికిత్సలను గుర్తించడం సాధ్యమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**డబ్ల్యూహెచ్‌వో అసలు ఏమంటోంది?**

ప్రపంచ ఆరోగ్య సంస్థ గతంలో 10 నుంచి 15 శాతం సిజేరియన్ రేటును ఒక సూచికగా ప్రస్తావించినప్పటికీ, ప్రస్తుతం ప్రతి దేశం తప్పనిసరిగా అదే శాతంలో ఉండాలని చెప్పడం లేదు. అవసరం ఉన్న మహిళకు సమయానికి సిజేరియన్ అందుబాటులో ఉండాలని ఔనూ ప్రధానంగా చెబుతోంది. అదే సమయంలో జనాభా స్థాయిలో సిజేరియన్ రేటు పెరిగిందనే ఒక్క కారణంతోనే తల్లి, శిశు మరణాలు నిరంతరం తగ్గుతాయని చెప్పడానికి ఆధారాలు లేవని కూడా పేర్కొంటోంది. అందువల్ల చర్చ "సిజేరియన్ మంచిదా? చెడ్డదా?" అన్నది కాదు. "అవసరమైనప్పుడు జరుగుతోందా?.. అవసరం లేకుండానా?" అన్నదే అసలు ప్రశ్న.

**ప్రతి ఆస్పత్రి గణాంకాలు బహిర్గతం చేయాలి**

**ఆస్పత్రుల వారీగా ప్రతి నెలా:**

మొత్తం ప్రసవాలు - సహజ ప్రసవాలు - సిజేరియన్లు - మొదటి సిజేరియన్ - పునరావృత సిజేరియన్ - అత్యవసర ఆపరేషన్లు - ముందుగా నిర్ణయించిన ఆపరేషన్లు - తల్లి, శిశు సమస్యలు వంటి వివరాలను వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు అందుబాటులో ఉంచితేనే అసలు పరిస్థితి బయటపడుతుంది. అధిక సిజేరియన్ శాతాలున్న ఆస్పత్రులను నిపుణుల బృందాలతో తనిఖీ చేయడం, ప్రతి శస్త్ర ప్రసవానికి వైద్య కారణాన్ని నమోదు చేయడం, రికార్డులను సమయానుకూలంగా ఆడిట్ చేయడం అవసరం.

**కావాల్సింది సిజేరియన్ వ్యతిరేకత కాదు**

సిజేరియన్ వైద్య విధానాన్ని తప్పుబట్టడం ఈ కథనం ఉద్దేశం కాదు. ప్రాణాపాయ పరిస్థితుల్లో అది తల్లీబిడ్డకు ప్రాణదాత. కానీ వైద్య అవసరం లేకుండానే జరుగుతున్న ఒక్క శస్త్ర ప్రసవం కూడా ఒక మహిళ ఆరోగ్యాన్ని అనవసర ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉంటుంది. అందుకే "సహజ ప్రసవమే తప్పనిసరి" అన్న మరో అతి వైపుకూ వెళ్లకుండా, "వైద్య అవసరమే నిర్ణయానికి ప్రమాణం" అనే విధానం అమలు కావాలి. మాతృత్వం మార్కెట్ నిర్ణయంగా కాకుండా... తల్లి-బిడ్డ భద్రతే కేంద్రంగా ఉండాలి.

# పోలీసింగ్ మారాలి

మార్పోగాలని దానికి అనుగుణంగా సిద్ధం కావాలని అన్నారు. నేరాల దర్యాప్తులో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పెరగాలని సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకూ సమావేశం నిర్వహించటం ఇదే తొలిసారి. శాంతిభద్రతల విషయంలో లోటు పాట్లను సవరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు విభాగం ఓ ప్రైడ్. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా అంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీసు, విజిబుల్ పోలీసింగ్ విధానం అమలు చేయాలి. గడచిన రెండేళ్లుగా కాగ్నిజబుల్ క్రైమ్స్ 14 శాతం మేర తగ్గాయి. కాలానుగుణంగా నేరాలు కూడా మారుతున్నాయి. డిజిటల్ క్రైమ్, డిజిటల్ అరెస్టులు తదితర నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. దీనికి అనుగుణంగా సాంకేతికతను పోలీసులు అందిపుచ్చుకోవాలి.

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం**

2019-24 మధ్య ఉన్న పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని ప్రధాన సమస్యగా తయారు చేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. గౌరవం పెరిగేలా చర్యలు చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 14,770 సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న కెమెరాలను కలిపి 1 లక్ష కెమెరాలను అనుసంధానించాం. నేరాల దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, డీఎన్ఏ డిటెక్షన్ లాంటి ఆధునిక విధానాలు పెరిగాయి. వేగంగా నేరాలను గుర్తించగలుగుతున్నాం. టెక్నాలజీ, నాలెడ్జి, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను పోలీసు అధికారులు సమర్థంగా అమలు చేస్తే శాంతిభద్రతలు నియంత్రణలోకి వస్తాయి. రాజకీయ నేరాలు, డిజిటల్ నేరాలు, సోషల్ మీడియా అసభ్య పోస్టుల లాంటి నేరాలు పెరిగాయి. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ అని పదేపదే చెబుతున్నాను. ఈ విషయంలో కఠినంగా ఉండాల్సిందే. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షించటంలో విఫలం కాకూడదు. నేర నియంత్రణకు పోలీసులూ గోల్డెన్ అవర్ విధానాన్ని పాటించాలి. తప్పు చేస్తే నేరస్తులు తప్పించుకోలేరని తెలిసేలా చేయాలి. వివేకా హత్య కేసు ఘటనలో పూర్తి సమాచారం రాలేదు. పోలీసుల వైపు నుంచి జరిగిన కాస్ట్ లీ మిస్టేక్ అది. కొందరు కావాలనే తప్పు దోవ పట్టించారు. ఇల్లంతా రక్తం మరకలతో తడిస్తే ఆ ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇది పూర్తి నిర్లక్ష్యం. నేరస్తుల పట్ల ఉదాసీనంగా ఉండొద్దు. జీరో డ్రగ్స్, గంజాయి లేకుండా జాతీయ స్థాయిలో ఓ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహిళల భద్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం డ్రగ్స్ వద్దు బ్రో అన్న ప్రచారాన్ని విస్తృతం చేయండి. రహదారి భద్రత కూడా కీలకమైన అంశం. రోడ్డు ప్రమాదాల అరికట్టేలా సైనేజీలు, రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌లను ఆడిట్ చేయాలి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించండి. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ పార్టీలకు లేదు**

శాంతిభద్రతల విషయంలో విఫలమైతే తీవ్రమైన పరిణామాలు మనం అంతా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక్క చిన్న నిర్లక్ష్యం మొత్తం పోలీసు వ్యవస్థపైనే మరక పడుతుంది. సింగయ్య వాహనం కింద పడిపోయి చనిపోతే కూడా ఎదురు ఆరోపణలు చేశారు. జగన్ కారు కింద పడిపోయినట్టుగా వీడియో వచ్చింది. కారు తొక్కేస్తే పొదల్లో పడేశారు. ప్రాణాలు కాపాడబోయిన పోలీసులపైనే నెపం పడింది. ఇబ్రహీంపట్నంలో రాజకీయ పార్టీ ర్యాలీలో రోడ్డుపై మోటారు సైకిల్ విన్యాసాలు ఏమిటి? పోలీసులపై కూడా దాడులు జరిగే పరిస్థితి ఉంది. ఏ పార్టీ అయినా రోడ్డుపై విన్యాసాలు చేసేందుకు అవకాశం లేదు. ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వెళ్లటం అన్ని పార్టీల బాధ్యత. రాజకీయ పార్టీ నేతలు కాబట్టి ఫ్రీగా వదిలేస్తామంటే శాంతిభద్రతల పరిస్థితి వస్తుంది. రాజకీయ పార్టీలకు ఇష్టానుసారం వ్యవహరించే లైసెన్సు ఇవ్వలేదు. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94 శాతం మంది ఒక పార్టీ నుంచే ఉంటున్నారు. పరామర్శలకు వెళ్లటం తప్పేం కాదు. రోడ్లపై చేసే ప్రదర్శనల వల్లే ప్రజలకు ఇబ్బందులు. విశాఖపట్నంలో 3 గంటల పాటు రోడ్లను బ్లాక్ చేశారు. అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లే వారు, ఆఫీసుకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే సీఎంగా నేను కూడా వాహన కాన్వాయ్ కుదించుకున్నాను. మానసిక పరిస్థితి సరిగాలేని కొందరు వ్యక్తులు చేసే నేరాలపై ప్రజల్లోనూ చర్చ జరగాలి. కొందరు రౌడీలే సామాజిక మాధ్యమాల్లో హీరోలుగా మారుతున్నారు.

**ఇక నెలవారీ పోలీసు పెర్ఫార్మెన్స్ రిపోర్టు**

శాంతిభద్రతల విషయంలో ఏపీ అత్యుత్తమ రాష్ట్రంగా ఉండాలన్నదే లక్ష్యం. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్య ప్రచారం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. నేర నిర్ధారణ రేటు పెరిగితే నేరాలు తగ్గుతాయి. పోలీసులు దర్యాప్తు చేసి విజయం సాధించిన కేసుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తి స్థాయిలో అమలు కావాలి. రాజకీయ పార్టీల ముసుగులో కొందరు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నారు. గతంలో మద్యం తాగించేవారు, ఇప్పుడు గంజాయి మత్తులో వీరంగం చేస్తున్నారు. కొన్ని సామాజిక మాధ్యమాల సాయంతో నేరస్తులుగా మారుతున్నారు. టెక్నాలజీ నేరస్తులను పట్టిస్తోంది, అదే సమయంలో నేరాలు పెంచుతోంది. బ్యాలెన్సింగ్, ప్రాపర్ పోలిసింగ్ ఉండాలి. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం, సంఘ విద్రోహ శక్తులకు భయం కలగాలి. రాష్ట్ర అభివృద్ధితో పాటు శాంతిభద్రతలు కూడా కీలకం. అప్పుడే సుపరిపాలన సాధ్యం. డీజీ కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్ వరకూ పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇక నుంచి ప్రతీ నెలా పోలీసు పెర్ఫార్మెన్సు రిపోర్టును విడుదల చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్, సక్సెస్ స్టోరీస్ సహా వివిధ అంశాలను ప్రజలకు వివరిద్దాం. అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీసు స్టేషన్ల నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సహా శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాలకు చెందిన 1650 మంది అధికారులు వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సమావేశానికి హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డీజీ ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, ఈగల్ టాస్క్ ఫోర్సు ఐజీ రవికృష్ణ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పోషకాహారం అందించాలి

చేశారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, కోడిగుడ్లు, పాలు, తాగునీటి సదుపాయాలు, ఆహార నిల్వలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పోషకాహార పథకాల లక్ష్యాలు పూర్తిగా నెరవేరాలంటే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని విజయ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. కోడిగుడ్లు, పాలు, ఇతర పోషకాహార పదార్థాలను నిబంధనల మేరకు నిర్ణీత సమయానికి విద్యార్థులకు అందించాలని సూచించారు. సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఒకే ప్రాంగణంలో ఉన్న వివిధ సంక్షేమ శాఖల వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న ఆహారం, సదుపాయాలు, పరిశుభ్రత విషయంలో ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, తాగునీటి వసతి, పరిశుభ్రత అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో నిర్వహణ, పరిశుభ్రత, పోషకాహారం అందజేతలో కనిపించిన మెరుగైన పరిస్థితులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి వి.పార్వతి, గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్.జ్యోతి, సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

# మార్చాలనుకుంటున్నారు

రాజ్యాంగపరంగా గౌరవించింది. అలాగే ఇదివరకు అమరావతి బిల్లును పాస్ చేసి చట్టబద్ధత కల్పించింది. అయితే రాజ్యాంగ విలువలపై నమ్మకం లేని కొందరు దాని పేరును మావిగన్‌గా మార్చాలనుకుంటున్నారు" అని తెదేపా ఎంపీ చింతకాయల విజయ్ విమర్శించారు. బుధవారం ఆయన రాజ్యసభలో కేరళ పేరును కేరళంగా మార్చే బిల్లుపై జరిగిన చర్చలో మాట్లాడారు. "భారత్ బలం దాని వైవిధ్యం పైనే ఆధారపడి ఉంది. ప్రతి రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక భాష, సంస్కృతి, గుర్తింపును మన సమాఖ్య వ్యవస్థ గౌరవిస్తోంది. కేరళం అనే పేరు ఆ రాష్ట్ర సంస్కృతికి అద్దంపడుతుంది. అందువల్ల కేరళను కేరళంగా మార్చడాన్ని పేరు మార్పుగా మాత్రమే చూడకుండా ఆ రాష్ట్ర భాషా సంస్కృతులకు ఇచ్చిన రాజ్యాంగపరమైన గుర్తింపుగా పరిగణించాలి. ఇప్పుడు ఈ బిల్లుకు మద్దతిచ్చినట్లుగానే పార్లమెంటు సభ్యులంతా అమరావతి బిల్లుకు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను" అని ఎంపీ విజయ్ పేర్కొన్నారు.

# ఎన్జీఆర్ఐతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ

రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ), రాష్ట్ర గనులు-భూగర్భశాస్త్ర శాఖల మధ్య ఎంఓయూ కుదిరింది. బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్‌జీఆర్‌ఐ-రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. తుమ్మలపల్లె, పరిసర ప్రాంతాల్లో ఎన్‌జీఆర్‌ఐ నిర్వహించిన ప్రాథమిక పరిశోధనల్లో లిథియం, గాలియం ఖనిజాల ఆనవాళ్లు గుర్తించారు. లిథియం గరిష్ఠంగా 1,000 పీపీఎం, గాలియం 250 పీపీఎం వరకు ఉన్నట్లు అంచనా వేశారు. దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నుంచి 100 శాతం నిధులతో... రూ.140 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. మరోవైపు ఏపీలోని గనుల రంగంలో పరిశోధన, టెక్నాలజీ, స్కిల్ డెవలప్మెంట్ వంటి అంశాలకు సంబంధించి ఐఐటీ(ఐఎస్‌ఎం) ధన్‌బాద్--టెక్స్‌మిన్, గనుల శాఖ మధ్య సీఎం సమక్షంలో మరో ఎంఓయూ కుదిరింది. దీని ద్వారా రాష్ట్రంలో గనులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ(ఐఎస్‌ఎం) ధన్‌బాద్ ఏర్పాటు చేయనుంది. ఈ ఎంఓయూ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

# ఎమ్మెల్యేలుగా ఎందుకు?

మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. సాయంత్రం పూట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలను ప్రదర్శిస్తామన్నారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరు కావడం లేదని.. అలాంటి వారికి జీతాలు ఎందుకు ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరుకాకపోవడమేంటన్నారు. సభకు రాని వారికి వేతనాలు ఇవ్వకూడదని.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరిగి చట్టం తీసుకురావాలని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. "సభకు రానివాళ్లు ఎమ్మెల్యేలుగా ఎందుకున్నారు?కొందరు సభ్యుల దొంగ సంతకాలను అరికట్టేందుకే ఫేస్ రికగ్నిషన్ పెట్టాం. 6 నెలల పాటు సభకు రాకుంటే అనర్హత వేటు వేసే అంశం చర్చల స్థాయిలో ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో చూస్తున్నాం. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపుపై సాధారణ పరిపాలన శాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం" అని అయ్యన్న తెలిపారు.

# గరిష్ఠస్థాయిలో వినియోగించుకోవాలి

తేలిందని మంత్రి ఉత్తమ్ చెప్పగా.. మూడు బ్యారేజీల విషయంలో ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం రేవంత్ సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి చిన్న చిన్న సమస్యలుంటే వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాల్లోని కొన్ని వ్యవసాయ భూములకు పెండింగ్‌లో ఉన్న పరిహారం వెంటనే చెల్లించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలన్నారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని చెప్పారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించాలన్నారు.

# పాడేరు డీఎస్పీ, కుటుంబసభ్యులపై కేసు

పెరిగిందంటూ రిజిస్ట్రేషన్ చేయకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో వెన్నా రాజసింహారెడ్డి నుంచి తమకు ప్రాణహాని ఉందని బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో నరసరావుపేట రూరల్ పీఎస్‌లో రాజసింహారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదైంది.

# వైకాపా నేతలపై కేసు నమోదు

నిర్వహించారని అరండల్‌పేట ఎస్ఐ ఈశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అంబటి, మోదుగుల, ఫాతిమా, రాజనారాయణతో పాటు మొత్తం 17 మంది వైకాపా నాయకులు, పలువురు కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రాణవాయువుపై 'క్యాన్సర్' పంజా.. ప్రాథమిక గుర్తింపుతోనే పూర్తిస్థాయి రక్షణ!




**ధూమపానం చేయని వారిలోనూ ఆందోళనకరంగా పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్.. యువతలో అత్యధిక నమోదు**

**ఏటా లక్షలాది మందిని కబళిస్తున్న మహమ్మారి.. వ్యాధి లక్షణాల గుర్తింపులో నిర్లక్ష్యమే కొంపముంచుతున్న వైనం**

**కాకినాడలో అవగాహన సదస్సు నిర్వహించి కీలక విషయాలు వెల్లడించిన సుప్రసిద్ధ పల్మనాలజిస్ట్ డాక్టర్ గోపీకృష్ణ యెడ్లపాటి**

**కాకినాడ, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో విజృంభిస్తోంది. అసాధారణ కణాల పెరుగుదలతో మొదలయ్యే ఈ ప్రాణాంతక వ్యాధి, ఎలాంటి స్పష్టమైన ప్రాథమిక లక్షణాలు చూపించకుండానే చాపకింద నీరులా దేహాన్ని ఆక్రమిస్తోంది. వ్యాధి ముదిరి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న తర్వాతే ఎక్కువ శాతం కేసులు వెలుగులోకి వస్తుండటం వైద్యరంగాన్ని కలవరపెడుతోంది. ఏటా దేశంలో అరవై వేలకు పైగా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ముందస్తు హెచ్చరికలు లేకుండా దాడి చేసే ఈ మహమ్మారి బారిన పడకుండా ఉండాలంటే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ఆధునిక జీవనశైలి, పెరుగుతున్న కాలుష్యం వెరసి క్యాన్సర్ ముప్పును మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, జీవితంలో ఎన్నడూ సిగరెట్ ముట్టని వారు సైతం ఈ వ్యాధి బారిన పడుతుండటం. నమోదవుతున్న కేసుల్లో పాతిక శాతం మంది పొగతాగని వారే కావడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది. పరోక్ష ధూమపానం, వాహన కాలుష్యం, ఆస్బెస్టాస్ మరియు రసాయన కర్మాగారాల్లో పనిచేయడం, జన్యుపరమైన లోపాలు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా పదిహేను నుంచి పాతిక సంవత్సరాల లోపు యువతలో పొగాకు, వేప్ వినియోగం ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. మారుతున్న ఈ ప్రతికూల వాతావరణంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య స్థితిగతులపై అవగాహన పెంచుకోవడం తక్షణ అవసరం. సాధారణ దగ్గుగా మొదలై ప్రాణాలను హరించే స్థాయికి ఈ వ్యాధి పరిణామం చెందుతుంది. దీర్ఘకాలికంగా వేధించే దగ్గు, కఫంలో రక్తం పడటం, అకారణంగా బరువు తగ్గడం, ఆకలి నశించడం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఈ తరహా సంకేతాలు కనిపించిన వెంటనే ఆధునిక వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే అంతం చేయవచ్చు. లో-డోస్ సీటీ స్కాన్, ఛాతీ ఎక్స్-రే వంటి పరీక్షల ద్వారా వ్యాధిని ముందే పసిగట్టి కచ్చితమైన చికిత్సను ప్రారంభించే అవకాశం ఉంది. వైద్యరంగంలో అత్యుత్తమ ప్రమాణాలతో, ప్రాణదాతగా పేరొందిన యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్సలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ, అడ్వాన్స్‌డ్ నావిగేషన్ బ్రాంకోస్కోపీ, ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఈబస్) వంటి ప్రపంచస్థాయి సాంకేతికతలతో రెండు సెంటీమీటర్ల కంటే చిన్న కణుతులను సైతం సునాయాసంగా గుర్తించి నివారించే అద్భుతమైన సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. సంక్లిష్టమైన రోబోటిక్ సర్జరీలు, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ కీమోథెరపీ వంటి అత్యాధునిక విధానాలను ఏకతాటిపై అందిస్తూ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ రోగులకు కొండంత భరోసానిస్తోంది. కాకినాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ పల్మనాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ గోపీకృష్ణ యెడ్లపాటి ఈ వ్యాధి తీవ్రతను వివరించారు. తన అపారమైన వైద్య నైపుణ్యంతో, ఎంతో నిబద్ధతతో వేలాది మంది ప్రాణాలు నిలబెట్టిన సుప్రసిద్ధ వైద్యుడు డాక్టర్ గోపీకృష్ణ, ఆధునిక సాంకేతికతతో క్యాన్సర్‌ను తొలిదశలోనే జయించవచ్చని స్పష్టం చేశారు. పొగాకు అలవాటు ఉన్నవారు, కాలుష్య కోరల్లో పనిచేసేవారు తప్పనిసరిగా ముందస్తు స్క్రీనింగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

# ఎడిటర్ వాయిస్

## అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అజెండా ఇదే.. ఫిక్స్ అయిన జగన్

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై విపక్షం వైసీపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 17 నుంచి శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు మొదలు కానున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేస్తుండగా, సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అదేసమయంలో శాసనసభతోపాటు మండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అయితే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభకు వెళ్లాలని నిర్ణయించారు. అదేసమయంలో శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీసేలా పలు అస్త్రాలను సిద్ధం చేయాలని చర్చించారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని వైసీపీ నిర్ణయించింది. శాసనమండలి సమావేశాల్లో ఇదే ప్రధాన అజెండాగా చర్చకు పట్టుబడాలని ఆ పార్టీ నిర్ణయించిందని చెబుతున్నారు. అంతేకాకుండా మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని ఒత్తిడి చేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాజీ సీఎం జగన్ రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. శాసనమండలికి యథావిధిగా హాజరుకావడంతోపాటు అసెంబ్లీ బయట రకరకాల కార్యక్రమాలతో డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు.

ఇక అసెంబ్లీ ప్రారంభానికి ఐదు రోజులు ముందుగానే విపక్షం అజెండా ఫిక్స్ చేయడం రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలపై వైసీపీ అనేక రకాలుగా ఆందోళనలు చేస్తోంది. రిలే నిరాహారదీక్షలతోపాటు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించింది. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భావిస్తున్న ప్రతిపక్ష సభ్యులు ఈ విషయంపై శాసనమండలిలో తాడోపేడో తేల్చుకుంటామని తేల్చిచెప్పడంతో వర్షాకాల సమావేశాలకు ముందే రాజకీయం కాకపుట్టిస్తోందని చెబుతున్నారు.

విపక్షం అజెండా ఎలా ఉండబోతుందో తేలిపోవడంతో ఇక ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. అసెంబ్లీకి రామని చెబుతున్న వైసీపీ తమ ఆరోపణలు మాత్రం ఆపమని తేల్చిచెబుతోంది. దీంతో విపక్షానికి సమాధానం చెప్పడానికి ప్రభుత్వం ఏ మార్గం ఎంచుకుంటుందనేది ఆసక్తి రేపుతోంది. శాసనమండలిలో ఇప్పటికీ విపక్షానికే బలం ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వ వాదనను సమర్థంగా తీసుకువెళ్లే అవకాశాలపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో బలం ఉన్నప్పటికీ వైసీపీ సభ్యులు హాజరుకాకపోవడం వల్ల చర్చలు ఏకపక్షంగా సాగిపోనున్నాయని అంటున్నారు. దీంతో ప్రభుత్వ వాదన ప్రజల్లోకి వెళుతుందా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ అసెంబ్లీ అజెండాపై వైసీపీ ముందుగానే స్పష్టత ఇవ్వడంతో ఈ సారి వర్షాకాల సమావేశాలు వాడివేడిగా కొనసాగే పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్





## లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు.. 30 మందికి గాయాలు



**జంగారెడ్డిగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బుధవారం ఉదయం ప్రమాదం జరిగింది. హైవేపై ఆగి ఉన్న లారీని హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ఇంటర్‌సిటీ స్మార్ట్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది గాయపడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం లక్కవరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్యాబిల్లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. క్షతగాత్రులను జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ఎల్బీనగర్ పీఎస్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జె.సాయి కుమార్ ఈరోజు తెల్లవారుజామున 2.30 గంటలకు ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలోని రెస్ట్ రూమ్‌లో ఉరి వేసుకున్నట్టు సిబ్బంది గుర్తించారు. వెంటనే సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 2024 బ్యాచ్‌కు చెందిన సాయికుమార్‌ను.. ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మరో వైపు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సాయికుమార్ ఆత్మహత్య చేసుకోలేదని, రక్తపు మరకలు ఎలా వచ్చాయని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వందలాది మంది పీఎస్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఒక దశలో పీఎస్‌లోకి దూసుకెళ్లి కంప్యూటర్, ప్రింటర్ ధ్వంసం చేశారు. ఉద్రిక్తత నెలకొనడంతో భారీగా పోలీసుల మోహరించారు.

## ఇన్‌స్టా పరిచయం.. ప్రేమ.. వివాహం.. హత్య



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు తిరుప్పూర్ జిల్లా పల్లడం సమీపంలోని పచ్చాపాళైయానికి చెందిన పళనిసామి, ధనలక్ష్మి(42) దంపతులు స్థానిక వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్నారు. వీరి కుమార్తె పూవరసి(22) ప్రైవేటు సంస్థలో పనిచేస్తోంది. మంగళవారం ఉదయం పళనిసామి విధులకు వెళ్లారు. ఇంట్లో ధనలక్ష్మి, పూవరసి మాత్రమే ఉన్నారు. అప్పుడు ఇంట్లోకి చొరబడిన ఓ యువకుడు ఇద్దరిపై కత్తితో దాడికి తెగబడ్డాడు. వారి కేకలు విన్న స్థానికులు వచ్చి చూడగా తల్లీకూతుళ్లు రక్తపుమడుగులో మృతిచెంది కనిపించారు. పారిపోవడానికి యత్నించిన యువకుడిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల దర్యాప్తులో.. దిండుక్కల్‌కి చెందిన 27 ఏళ్ల అక్షయ్‌కు ఐదేళ్ల క్రితం పూవరసి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైంది. తర్వాత పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల క్రితం ఇద్దరూ రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. పూవరసి పుట్టింట్లోనే ఉంటూ ఉద్యోగం చేస్తోంది. వీరి ప్రేమ, పెళ్లి విషయం తల్లి ధనలక్ష్మి తెలియడంతో మాట్లాడకూడదని మందలించారు. దీంతో పూవరసి భర్త అక్షయ్‌తో మాట్లాడటం మానేసింది. ఆగ్రహానికి గురైన అక్షయ్.. తల్లి, కుమార్తెను హత్య చేశాడు.

## రక్తసిక్తమైన 65వ నంబరు జాతీయ రహదారి

**సంగారెడ్డి జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది మృతి**
**ఆటోను ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు కూలీల దుర్మరణం**
**మరో ఘటనలో కారు అదుపు తప్పి ఇద్దరు మృత్యువాత**



**జహీరాబాద్ అర్బన్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్-ముంబయి 65వ నంబరు జాతీయ రహదారి మంగళవారం రక్తసిక్తమైంది. సంగారెడ్డి జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతిచెందారు. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఆటోను వేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టడంతో ఆరుగురు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో డివైడర్‌ను ఢీకొన్న కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన 11 మంది మహిళా కూలీలు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుధేరా పరిసరాల్లోని పొలాల్లో కలుపుతీత పనులకు వచ్చారు. పనులు ముగించుకుని ఆటోలో తిరుగు పయనమయ్యారు. సత్వార్ సమీపంలో జాతీయ రహదారిపై యూటర్న్ వద్ద ఆటో డ్రైవర్ వాహనాన్ని తిప్పుతుండగా ముంబయి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే నలుగురు ప్రాణాలు విడిచారు. చికిత్స పొందుతూ ఇద్దరు కన్నుమూశారు. మృతులను రేఖమ్మ(36), కవిత(40), శ్రీదేవి(45), రేష్మ(28), నిఖిత(30), ఆటో డ్రైవర్ దేవదాస్(35)గా గుర్తించారు. వీరిలో దేవదాస్, నిఖిత దంపతులు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఘటనలో జహీరాబాద్ వైపు నుంచి సదాశివపేట వైపు వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి అపసవ్య దిశలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సదాశివపేట మండలానికి చెందిన శంకర్(52), మల్లికార్జున్(50)లు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

**సీఎం దిగ్భ్రాంతి:** సత్వార్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు కూలీలు మృతి చెందడంపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



# ఉప్పాడ తీర రక్షణకు రూ.323 కోట్ల భారీ ప్రాజెక్టు

**ఐఐటీ మద్రాస్‌తో కీలక ఒప్పందం - ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో అవగాహన ఒప్పందం**

**రక్షణ గోడ డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక, సాంకేతిక పర్యవేక్షణ ఐఐటీ మద్రాస్ బాధ్యత - నవంబర్ నుంచి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు**



**కాకినాడ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ ప్రతినిధి న్యూస్ :** సముద్ర కోతతో ఏళ్లుగా తీవ్రంగా ప్రభావితమవుతున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీరాన్ని సముద్రపు కోత నుంచి కాపాడేందుకు రూ.323 కోట్ల వ్యయంతో తీర రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు అవసరమైన రక్షణ నిర్మాణాల రూపకల్పన, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ, సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ మద్రాస్‌కు అప్పగిస్తూ బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో సంబంధిత శాఖల అధికారులు, ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు ఈ ఒప్పంద ప్రక్రియను పూర్తి చేశారు.

**కేంద్ర నిధులతో తీరానికి రక్షణ కవచం**

కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి కింద ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను అమలు చేసే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు చేపట్టనుంది. సముద్ర కోత కారణంగా ఉప్పాడ తీర ప్రాంతంలో రహదారులు, నివాస ప్రాంతాలు, మత్స్యకార గ్రామాలకు తరచూ ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ఈ భారీ ప్రాజెక్టును చేపట్టింది.

**శాస్త్రీయ అధ్యయనంతో రక్షణ గోడ రూపకల్పన**

ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఓషన్ ఇంజనీరింగ్ నిపుణులు ఉప్పాడ సముద్ర తీర పరిస్థితులను శాస్త్రీయంగా అధ్యయనం చేయనున్నారు. సముద్ర ప్రవాహాల దిశ, అలల తీవ్రత, తీర కోత వేగం, భౌగోళిక పరిస్థితులు, తుపానుల సమయంలో అలల ప్రభావం వంటి అంశాలను పరిశీలించి, ఉప్పాడ తీరానికి అనువైన రక్షణ నిర్మాణాల నమూనాను రూపొందించనున్నారు. ఈ అధ్యయనాల ఆధారంగానే రక్షణ గోడకు సంబంధించిన పూర్తి డిజైన్, అంచనాలు, నిర్మాణ విధానం, సాంకేతిక ప్రమాణాలతో కూడిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయనున్నారు.

**నవంబర్ నుంచి పనులకు శ్రీకారం**

ఐఐటీ మద్రాస్‌తో అవగాహన ఒప్పంద ప్రక్రియ పూర్తికావడంతో రానున్న నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించే దిశగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ప్రాజెక్టు పూర్తయితే ఉప్పాడ తీర ప్రాంతంతో పాటు సమీప మత్స్యకార గ్రామాలకు సముద్ర కోత ముప్పు నుంచి దీర్ఘకాలిక రక్షణ లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సముద్ర కోత సమస్యకు శాస్త్రీయ, శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ ప్రాజెక్టు అత్యంత కీలకంగా మారనుంది. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి శరవణన్, పాడా డైరెక్టర్ డా. ఎన్.వి. శివరామ ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ. సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి. రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



# కాకినాడలో చీకట్లు.. కాగడాతో నిరసన

- స్లమ్ ప్రాంతాల్లో సగం వీధి దీపాలు వెలగడం లేదని ఆరోపణ
- 18 పార్కుల్లో అంధకారం నెలకొందన్న సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు
- మహావీర్ విగ్రహం వద్ద జాతీయ పతాకంతో వినూత్న నిరసన

**కాకినాడ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ సిటీ న్యూస్ :** కాకినాడ నగరంలో వీధి దీపాల నిర్వహణ, పార్కుల సంరక్షణ, పారిశుద్ధ్య వ్యవస్థపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించాలని ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ బుధవారం రాత్రి ఆయన వినూత్నంగా నిరసన తెలిపారు. కలెక్టరేట్‌కు సమీపంలోని తోట గోపాలకృష్ణ పార్కులో ఉన్న మహావీర్ విగ్రహం వద్ద కాగడా వెలిగించి, జాతీయ పతాకాన్ని చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని కీలక ప్రాంతంలో ఉన్న ఈ పార్కులో తగిన వెలుతురు, పచ్చదనం నిర్వహణ, నామఫలకం వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా లేవని ఆయన ఆరోపించారు. నగరపాలక సంస్థకు ఎన్నికలు జరగకపోవడం, సమర్థవంతమైన పర్యవేక్షణ కొరవడటం వల్ల పౌర సౌకర్యాల నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయని రమణరాజు పేర్కొన్నారు. తోట గోపాలకృష్ణ పార్కులో చీకటి కారణంగా అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతోందని, పార్కులోని మహావీర్ విగ్రహం కూడా రాత్రివేళల్లో స్పష్టంగా కనిపించని పరిస్థితి ఉందన్నారు. నగరంలోని స్లమ్ ప్రాంతాల్లో దాదాపు 50 శాతం వీధి దీపాలు వెలగడం లేదని ఆయన ఆరోపించారు. ప్రధాన కూడళ్లలోని దీపాల మరమ్మతులకే అధికారులు పరిమితమవుతున్నారని, అంతర్గత వీధులు, పేదల నివాస ప్రాంతాలపై తగిన శ్రద్ధ చూపడం లేదన్నారు. నగరంలోని నాలుగు ప్రధాన పార్కులు మినహా సుమారు 18 పార్కుల్లో రాత్రివేళ తగిన వెలుతురు లేదని రమణరాజు పేర్కొన్నారు. వివేకానంద బోటు క్లబ్, శ్రీనగర్, గాంధీనగర్ ప్రాంతాల్లోని పార్కుల్లోనూ పలు విద్యుత్ దీపాలు పనిచేయడం లేదన్నారు.

**జాతీయ నేతల విగ్రహాలకు వెలుగులేవీ?**

స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలోని మహనీయుల విగ్రహాలు రాత్రివేళ స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక దీపాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. జవహర్ వీధిలోని వివేకానంద పార్కు తూర్పు ముఖద్వారం వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి గతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వెలుగుల నిర్వహణను తిరిగి చేపట్టాలని సూచించారు. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ తదితర మహనీయుల విగ్రహాల వద్ద కూడా రాత్రివేళ సరైన వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆనందభారతి ప్రాంతంతోపాటు పలు ముఖ్య కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, జిల్లా కోర్టు, సబ్‌జైలు పరిసర ప్రాంతాల్లోనూ వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రజా సమస్యలపై తక్షణ స్పందన అవసరం**

వీధి దీపాలు, డ్రైనేజీ శుభ్రత, పారిశుద్ధ్యం వంటి రోజువారీ ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధుల కార్యాలయాల నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత మాత్రమే పరిష్కరించే పరిస్థితి ఉండకూడదని రమణరాజు అభిప్రాయపడ్డారు. నగరపాలక సంస్థ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలో కనీసం 90 శాతం వీధి దీపాలు నిరంతరం వెలిగేలా నిర్వహణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే వెలగని వీధి దీపాల వద్ద ప్రతి రాత్రి కాగడా, జాతీయ పతాకంతో పాదయాత్ర నిర్వహిస్తానని రమణరాజు ప్రకటించారు.

# గోదావరి పుష్కరాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న గోదావరి పుష్కరాలు-2027 సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు పటిష్టమైన భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో కలిసి రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని కొంతమూరు, కాతేరు ప్రాంతాల్లో పుష్కర నగర్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా షటిల్ బస్సుల నిలుపుదల కేంద్రాలు, వాటి రాకపోకలకు అవసరమైన మార్గాలను పరిశీలించారు. పుష్కరాల బందోబస్తు విధుల కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పోలీసు సిబ్బందికి వసతి కల్పించేందుకు అనువైన ప్రదేశాలను కూడా అధికారులు పరిశీలించారు. భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు సిబ్బంది రాకపోకలు, అత్యవసర సేవలు, వాహనాల పార్కింగ్, ఇతర మౌలిక వసతులపై సమగ్రంగా పరిశీలన చేశారు. పుష్కరాలను సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు చర్చించారు. ఈ పరిశీలనలో అదనపు ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీఈడీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వీసీ



**రాజమహేంద్రవరం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాలలో జరుగుతున్న బీ.ఈడీ రెండో సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని బుధవారం వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పరిశీలించారు. ఈ కేంద్రంలో అనపర్తికి చెందిన జీబీఆర్ బీ.ఈడీ కళాశాల, ఏలేశ్వరానికి చెందిన సాయి బాలాజీ బీ.ఈడీ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని వీసీ సూచించారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని బీ.ఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. వీసీ వెంట రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# 'ఢాయ్ అఖర్' జాతీయ స్థాయి ఉత్తర లేఖన పోటీ

**జాతీయ స్థాయి విజేతలకు యాభై వేల రూపాయల వరకు నగదు బహుమతులు**

**కాకినాడ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత తపాలా శాఖ రెండువేల ఇరవై ఆరు-ఇరవై ఏడు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 'మాతృభూమికి లేఖ - ప్రకృతి పరిరక్షణకు నా వాగ్దానం' అనే అంశంపై 'ఢాయ్ అఖర్ ఉత్తర లేఖన కార్యక్రమం' పేరుతో జాతీయ స్థాయి ఉత్తర లేఖన పోటీ నిర్వహిస్తున్నట్లు కాకినాడ తపాలా విభాగం పర్యవేక్షణాధికారి కె.కృష్ణ తెలిపారు. ఈ పోటీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆసక్తిగల పౌరులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పద్దెనిమిది సంవత్సరాల లోపు వారు, పద్దెనిమిది సంవత్సరాలు పైబడిన వారు అనే రెండు వయో విభాగాల్లో పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీదారులు తెలుగు, హిందీ లేదా ఇతర ప్రాంతీయ భాషల్లో తమ లేఖలను రాయవచ్చన్నారు. పూర్తి చేసిన లేఖలను రెండువేల ఇరవై ఆరు అక్టోబర్ ముప్పై ఒకటో తేదీలోపు వేగవంత తపాలా సేవ ద్వారా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ స్థానంలో కాకినాడ తపాలా విభాగం పర్యవేక్షణాధికారి, కాకినాడ - ఐదు మూడు మూడు సున్నా సున్నా ఒకటి చిరునామాకు పంపాలని కె. కృష్ణ సూచించారు. గడువు తేదీ అనంతరం అందిన లేఖలను పోటీకి పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ తపాలా వృత్త స్థాయిలో విజేతలకు మొదటి బహుమతిగా ఇరవై ఐదు వేల రూపాయలు, రెండో బహుమతిగా పది వేల రూపాయలు, మూడో బహుమతిగా ఐదు వేల రూపాయలు అందజేస్తారని తెలిపారు. వృత్త స్థాయి విజేతలను రెండువేల ఇరవై ఆరు డిసెంబర్ ముప్పై ఒకటో తేదీలోపు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే భారత తపాలా శాఖ జాతీయ స్థాయిలో ఎంపికైన విజేతలకు మొదటి బహుమతిగా యాభై వేల రూపాయలు, రెండో బహుమతిగా ఇరవై ఐదు వేల రూపాయలు, మూడో బహుమతిగా పది వేల రూపాయలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రకృతి పరిరక్షణపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థులు, యువతలో అవగాహన పెంపొందించడంతో పాటు ఉత్తర రచనా నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీలో అర్హులైన ప్రతి ఒక్కరూ పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ తపాలా విభాగం అధికారులు కోరారు.

సీతానగరం మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు

# పంపిణీ చేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్వయంగా అందజేశారు. హుండేశ్వరపురం గ్రామానికి చెందిన వేమగిరి వెంకన్నకు రూ.51,186/-లు, రుద్రు గంగా భవానికి రూ.36,843/-లు, మిర్తిపాడు గ్రామానికి చెందిన మామిడి యశ్వంత్ కు రూ.25,524/-లు, కాటవరం గ్రామానికి చెందిన కత్రగడ్డ సూర్యచంద్రరావుకు రూ.1,39,258/-లు, కొత్తపల్లి వెంకట దుర్గంకు రూ.25,000/-లు మునికూడలి గ్రామానికి చెందిన బుంగా భూషణంకు రూ.42,193/-లు, రఘుదేవపురం గ్రామానికి చెందిన మార్ని శశిధర్ శ్రీవాస్ కు రూ.4,28,437/- లు రాపాక గ్రామానికి చెందిన భవిశెట్టి వెంకటేశ్వరరావుకు రూ.3,91,852/-లు, సీతానగరం గ్రామానికి చెందిన ఖలీల్ బాగ్‌కు రూ.31,192/-లు, ముల్లా పోసేస్వరికి రూ.23,400/లు, కూనవరం గ్రామానికి చెందిన ఆయిల వెంకట రామారావుకు రూ.25,000/-లు మొత్తం 11 మంది లబ్ధిదారులకు రూ.12,19,885/- విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు తమకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు, వారి సతీమణి వెంకటలక్ష్మికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల ఆలోచనలకు రెక్కలు




**రాజమహేంద్రవరం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కా లాంబా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'మా తుఝే సలాం ఉడాన్ అభియాన్'లో భాగంగా రాజమహేంద్రవరంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పేపర్ వద్దనున్న కృష్ణసాయి కళ్యాణ మండపంలో తూర్పుగోదావరి జిల్లా పార్లమెంటరీ సమన్వయకర్త టీకే విశ్వేశ్వర్ రెడ్డి, నగర జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళి, జిల్లా మహిళా అధ్యక్షురాలు మోతా సారథ, నిడదవోలు కాంగ్రెస్ ఇన్‌చార్జి భద్రం దొర, మహిళా నాయకురాలు జయలలిత సమక్షంలో కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అమర్ జహాబేగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు. గాలిపటాలపై మహిళల ఆలోచనలు, ఆశయాలు, స్వేచ్ఛ, హక్కులు, భద్రతతో పాటు మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అక్షరాలు, చిత్రాల రూపంలో ఆవిష్కరించారు. 79 ఏళ్ల స్వాతంత్ర్య ప్రస్థానంలో మహిళలు సాధించిన హక్కులు, భద్రత, స్వేచ్ఛను గాలిపటాల ద్వారా ప్రదర్శించడం గర్వకారణమని అమర్ జహాబేగ్ తెలిపారు. మహిళల సమస్యలు, ఆకాంక్షలను సమాజానికి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాజమహేంద్రవరం మెడికో డాక్టర్ ప్రియాంక హత్య ఘటనను కూడా గాలిపటం రూపంలో ఆవిష్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళలపై జరిగే అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు. క్యూఆర్ కోడ్ ద్వారా గాలిపటాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్వాహకులు సూచించారు. ఎంపికైన పలువురిని ఆగస్టు 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి తీసుకెళ్లనున్నట్లు అమర్ జహాబేగ్ తెలిపారు. ఉత్తమ గాలిపటాలకు మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేల చొప్పున ఇద్దరికి, రూ.30 వేల చొప్పున ముగ్గురికి అందజేయనున్నట్లు వెల్లడించారు.

# మహిళల, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యత

**శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష - పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్**



**మండపేట మండలం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమీక్షలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,650 మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, అన్ని జిల్లాల ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు హాజరయ్యారు. మండపేట రూరల్ సర్కిల్ అధికారులు కూడా వీడియో ద్వారా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను కట్టడి చేయడంలో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడానికి ఆధునిక టెక్నాలజీని వినియోగించాలని, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.అలాగే సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న తప్పుడు ప్రచారాలు, పుకార్లను వెంటనే గుర్తించి నియంత్రించాలని స్పష్టం చేశారు. నమోదైన కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా పోలీసింగ్ సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.శాంతిభద్రతలను ఏ మాత్రం విస్మరించకుండా రాష్ట్రంలో ప్రజలకు భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రూరల్ సీఐ పి దొర రాజు, ఎస్ ఐ లు ఈ విడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

రామచంద్రపురంలో గడపగడపకు

# వైఎస్సార్ కార్యక్రమం



రామచంద్రపురం, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : రామచంద్రపురం టౌన్ 22వ వార్డ్ పరిధిలోని పిట్టవారి వీధి, కొండపల్లి వారి వీధి, రత్నంపేట, ముచ్చిమిల్లి రోడ్డులో గడపగడపకు వైఎస్సార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు, రామచంద్రపురం వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడిన పిల్లి సుభాష్ చంద్రబోస్, సూర్యప్రకాష్ గత ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలు, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య ప్రజలు గమనిస్తున్న తేడాలను తెలుసుకుంటూ ప్రతి కుటుంబంతో మమేకమయ్యారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోరాట ఫలితంగా కార్మికుడు

# ఈగల స్వామి అయ్యప్పకు న్యాయం



రామచంద్రపురం, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణానికి చెందిన కార్మికుడు ఈగల స్వామి అయ్యప్పకు ఐ.ఎఫ్.టీ.యూ రెండు నెలలుగా చేసిన పోరాటం ఫలితంగా ఎట్టకేలకు న్యాయం జరిగింది. మండపేట మండలం ఏడిద సురేంద్ర ఆయిల్స్ మిల్లులో ఈ ఏడాది మే 20వ తేదీన విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదానికి గురైన స్వామి అయ్యప్ప కాలు విరిగిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి బాధితుడికి న్యాయం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టీ.యూ) ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయబద్ధమైన పరిహారం కోసం పోరాటం కొనసాగించారు. అధికారుల సానుకూల స్పందనతో బుధవారం కాకినాడలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లేబర్ కమిషనర్ కార్యాలయంలో డీసీఎల్ సమక్షంలో ఏడిద సురేంద్ర ఆయిల్స్ మిల్లు యాజమాన్యం నష్టపరిహారంగా రూ.1,50,000 చెక్కును స్వామి అయ్యప్పకు అందజేసింది. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టీ.యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి బి.సిద్దు మాట్లాడుతూ బాధితుడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, స్పందించి న్యాయబద్ధంగా పరిష్కారం చూపిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అనేక పరిశ్రమల్లో కార్మిక చట్టాలు, భద్రతా నిబంధనలు, కనీస వేతన చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ, వారికి తగిన వేతనాలు, భద్రత కల్పించకుండా యాజమాన్యాలు వ్యవహరించడం ఆందోళనకరమన్నారు. మహిళా సాధికారత గురించి ప్రభుత్వాలు ఎన్ని ప్రకటనలు చేస్తున్నప్పటికీ జిల్లాలో అనేక ప్రాంతాల్లో మహిళా కార్మికులకు రోజువారీ శ్రమకు కేవలం రూ.300 చొప్పున వేతనం అందుతున్న దుస్థితి కొనసాగుతోందని గుర్తుచేశారు. మహిళా కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, సమాన పనికి సమాన వేతనం, చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐ.ఎఫ్.టీ.యూ నిరంతరం పోరాడుతుందని, పరిశ్రమల్లో కార్మిక చట్టాల అమలు, ప్రమాదాల నివారణ, బాధితులకు న్యాయమైన పరిహారం, కనీస వేతనాల అమలు కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. న్యాయం జరగడంతో స్వామి అయ్యప్ప కుటుంబ సభ్యులు కాకినాడ ఉమ్మడి జిల్లా లేబర్ కమిషనర్ బుల్లి రాణి, స్నేహ, ఏడిద సురేంద్ర ఆయిల్స్ మిల్లు యజమాని ముత్యాల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు ఎస్.కె. కమల్ బాషా, వి. భీమశంకరం, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గారపాటి అశోక్ కుమార్

# జన్మదిన వేడుకలు




మండపేట మండలం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ : వైసీపీ సీనియర్ నేత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అనుచరుడు గారపాటి అశోక్ కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం మెర్నిపాడులో ఘనంగా జరిగాయి. గ్రామంలోని వైసీపీ కార్యాలయంలో, ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అభిమానుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి పార్టీ శ్రేణులు కార్యాలయానికి చేరుకొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ సర్పంచ్ గా మెర్నిపాడును అభివృద్ధి బాటలో నడిపించిన అశోక్ కుమార్ భవిష్యత్తులో రాజకీయంగా, వ్యాపార పరంగా ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# 300 మీటర్ల భారీ జాతీయ జెండాతో ఘనంగా తిరంగా ర్యాలీ

**దేశభక్తిని చాటుకున్న విద్యార్థులు, ప్రజలు - స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి**

**కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**



రామచంద్రపురం, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రామచంద్రపురం పట్టణంలోని విజ్ఞానభారతి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో 300 మీటర్ల భారీ జాతీయ జెండాతో నిర్వహించిన తిరంగా ర్యాలీ అత్యంత ఘనంగా జరిగింది. దేశభక్తి నినాదాలు, జాతీయ జెండాల రెపరెపల మధ్య సాగిన ఈ ర్యాలీ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్యం మనకు ఎంతో మంది మహనీయుల పోరాట ఫలితంగా లభించిందని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని, యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతదేశం ప్రపంచంలో అగ్రగామి దేశంగా ఎదుగుతున్న ఈ సమయంలో దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి భావన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, జాతీయ పతాకం ప్రతి భారతీయుడి గౌరవానికి ప్రతీక అని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించి దేశభక్తి స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షులు దునే శ్రీనివాసు, మాజీ పట్టణ అధ్యక్షులు కేసవ రాఘవేంద్రరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబు, జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ సలాది సతీష్ నాయుడు, సీనియర్ నాయకులు కుప్పెల సూర్యనారాయణ, యాంద్ర బుల్లబులు, జిల్లా యువమోర్చా అధ్యక్షులు గానాల కళ్యాణ్, జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శి తోలేటి సూర్య గంగాధర్, కృతివెంటి పేర్రాజు పంతులు చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ సలాది వెంకప్పనాయుడు, విజ్ఞానభారతి పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో దేశభక్తులు పాల్గొని తమ దేశప్రేమను చాటుకున్నారు.

రాజమండ్రి మెడికల్ విద్యార్థిని ప్రియాంకను హత్య చేసిన

# నిందితులను కఠినంగా శిక్షించాలి




రామచంద్రపురం, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : రాజమహేంద్రవరంలో మెడికల్ విద్యార్థిని ప్రియాంక మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రామచంద్రపురంలోని సెయింట్ ఏన్ గ్లోరియా కాలేజీ వద్ద విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు వి.భీమశంకరం మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీ రాత్రి రాజమహేంద్రవరంలోని ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. సినిమా చూసి సహచర విద్యార్థి ఉమేష్‌తో కలిసి బైక్‌పై బయలుదేరిన ప్రియాంకను, మద్యం మత్తులో కారు నడిపిన సురవరపు దుష్యంత్, ఆంథ్రూ విలియం జోసెఫ్‌లు ఢీకొట్టడం అత్యంత అమానుషమన్నారు. థియేటర్ గేటు వద్ద వాహనాల రద్దీ కారణంగా ఆగి ఉన్న బైక్‌ను వేగంగా వచ్చి ఢీకొట్టడమే కాకుండా, ఉద్దేశపూర్వకంగా మరో రెండుసార్లు ఢీకొట్టి ప్రియాంకపై నుంచి కారును పోనివ్వడం ఈ దారుణానికి అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను మొదట ప్రైవేటు ఆసుపత్రికి, ఆ తర్వాత పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడం అత్యంత విషాదకరమన్నారు. సమాజానికి సేవ చేయాల్సిన ఒక యువ వైద్యురాలు అకాల మరణం చెందడం తీరని లోటని పేర్కొన్నారు. మద్యం మత్తులో అమాయకుల ప్రాణాలు బలిగొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని వారు విమర్శించారు. ఈ కేసును ప్రమాదం పేరుతో నీరుగార్చే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, వైద్య నివేదికలు, వాహన వివరాలు తదితర ఆధారాలను సమగ్రంగా పరిశీలించి పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా చట్టం ముందు సమానులేనని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితులను శిక్షించడంతో పాటు, బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, అఘాయిత్యాలను అరికట్టాలని, ప్రియాంకకు న్యాయం జరిగే వరకు పీడీఎస్‌యూ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు చింత రాజారెడ్డి, సెయింట్ ఏన్ గ్లోరియా జూనియర్ కాలేజీ చైర్మన్ శ్రీకాంత్, డైరెక్టర్ పంపన గోవింద్, ప్రిన్సిపాల్ మహేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్, అక్షయ, ఆశల్య, స్వాతి తదితర విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**ఉమ్మడి తూర్పుగోదావరి జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాల్లో విస్తృత చర్చ**

**ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, రహదారులు, పంట కాలువలు, పాఠశాలల ప్రహరీలపై సభ్యుల వినతులు**




కాకినాడ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ సిటీ న్యూస్ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన ఒకటి, రెండు, నాలుగు, ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. వైస్ ఛైర్‌పర్సన్, మూడో స్థాయీ సంఘం ఛైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన మూడో స్థాయీ సంఘం, మేరుగు పద్మలత అధ్యక్షతన ఆరో స్థాయీ సంఘం, రొంగల పద్మావతి అధ్యక్షతన ఐదో స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, జెడ్పీటీసీలు, శాశ్వత ఆహ్వానితులు, ప్రజాప్రతినిధులు, నాలుగు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపై విస్తృతంగా చర్చించి పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

**అభివృద్ధి పథకాలపై సమగ్ర సమీక్ష**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాల పురోగతిని జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సమీక్షించారు. నీటిపారుదల, ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, విద్యుత్ తదితర శాఖల పనితీరుపై అధికారులతో చర్చించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న కొత్త పనులు, ఇప్పటికే కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

**రైతులకు వారంలో సాగునీరు**

మూడో స్థాయీ సంఘం ఛైర్మన్ బుర్రా అనుబాబు, గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యులు రైతులకు వరి సాగు కోసం తక్షణమే సాగునీరు విడుదల చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు వారం రోజుల్లో సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని సమావేశానికి తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రస్తుత పంటల సాగు పరిస్థితులు, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, పంటల బీమా తదితర అంశాలను సభ్యులకు వివరించారు.

**ఆసుపత్రుల్లో రక్త నిల్వలు అందుబాటులో ఉంచాలి**

ఆరో స్థాయీ సంఘం ఛైర్మన్ మేరుగు పద్మలత తొండంగి మండలంలో రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు వచ్చే గర్భిణులకు అత్యవసర సమయాల్లో రక్తం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు.

**ఆసుపత్రుల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి**

జగ్గంపేట, రాజోలు, మామిడికుదురు, రౌతులపూడి, గంగవరం ఏజెన్సీ, మారేడుమిల్లి ప్రాంతాల జెడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంతాల్లో నెలకొన్న వివిధ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించాలని, రాజోలు మండలం చేన్నడం గ్రామంలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కాట్రేనికోన జెడ్పీటీసీ సభ్యులు మండలంలోని పలు గ్రామాల్లో పంట కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం**

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతి, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను సమావేశానికి వివరించారు. అనంతరం జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. సభ్యులు ప్రస్తావించిన ప్రజా సమస్యలను అధికారులు ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత కాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి డి. శ్రీలలిత, వివిధ జిల్లాల శాఖాధికారులు, జెడ్పీ పరిపాలనాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ ఆసరా పథకం కింద

# బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



రామచంద్రపురం, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ : రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ బాధ్యులు, పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు స్మారక సేవా సంస్థ అధ్యక్షులు పోలిశెట్టి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ ఆసరా పథకం కింద బుధవారం నియోజకవర్గంలో బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి సేవా సంస్థ ద్వారా ఈ సరుకులను అందజేశారు. కె.గంగవరం మండలం పామర్రులో మల్లిడి గోపీకృష్ణ, యండగండిలో పాము రాజు, కుడుపూడిలో మొగలి నాగలక్ష్మి, కాజులూరు మండలం నామవానిపాలెంలో తాతపూడి వెంకన్న, పల్లిపాలెంలో సబ్బతి గణేశ్వరరావు, శీలలో మండపాటి భాగ్యలక్ష్మి, కాజులూరులో దండంగి వెంకాయమ్మ, తిప్పరాజు పాలెంలో ముడుకు వెంకన్న, అంద్రంగిలో గిడ్డ వీరమ్మ కుటుంబాలకు సరుకులు అందించారు. అలాగే రామచంద్రపురం మండలం మాలపాడులో పందిరి సుజాత, తాటిపల్లిలో పత్తి అగ్గిరాముడు, ఏరుపల్లిలో కొలపు కొండయ్య, పెయ్యలపేటలో పెయ్యల చిన్న వెంకటేశ్వరరావు, వెలంపాలెంలో పోతుల గంగాభవాని, రామచంద్రపురం పట్టణం జల్లిపేటలో కనికళ్ల సత్యం కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు. జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు, నియోజకవర్గ సేవా సంస్థ సమన్వయకర్త గుబ్బల శ్రీనివాస్, జనసేన పార్టీ కె.గంగవరం మండల అధ్యక్షులు చిర్రా రాజకుమార్, పోలిశెట్టి పెదబాబు బాధిత కుటుంబాలకు ఈ సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రాణం పోసే మహాదానం..

# అవయవదానంపై అపోహలు వీడాలి

- ఒక్క దాతతో ఎనిమిది మందికి కొత్త జీవితం
- బ్రెయిన్ డెత్.. కోమా రెండూ ఒకటి కావు
- కుటుంబ సభ్యులతో ముందుగానే చర్చించాలి
- 13న ప్రపంచ అవయవదాన దినోత్సవం
- డా. ఎస్.సి.హెచ్.ఎస్. రామకృష్ణ పిలుపు



కాకినాడ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ సిటీ న్యూస్ : రక్తదానం ఒకరి ప్రాణాన్ని కాపాడితే.. అవయవదానం అనేక కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపగలదని కిమ్స్ ట్రస్ట్ హాస్పిటల్ చీఫ్ ఇంటెన్సివిస్ట్, క్రిటికల్ కేర్ ఫిజీషియన్, భారత వైద్య సంఘం కాకినాడ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎస్.సి.హెచ్.ఎస్. రామకృష్ణ పేర్కొన్నారు. మనిషి జీవితం ముగిసిన తర్వాత కూడా అతని అవయవాలు మరొకరిలో జీవించగలవని, అందుకే అవయవదానంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి ప్రతి కుటుంబంలో దీనిపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 13న ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో అవయవదానం ప్రాధాన్యత, బ్రెయిన్ డెత్‌పై అవగాహన, దేశంలో అవయవ మార్పిడుల పరిస్థితిని ఆయన వివరించారు.

**బ్రెయిన్ డెత్ అంటే కోమా కాదు**

బ్రెయిన్ డెత్, కోమా రెండూ ఒకటి కావని డా. రామకృష్ణ స్పష్టం చేశారు. కోమాలో ఉన్న వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి తిరిగి కోలుకునే అవకాశాలు ఉండవచ్చని, అయితే బ్రెయిన్ స్టెమ్ డెత్ శాశ్వతమని వివరించారు. అధీకృత వైద్య బృందం నిర్దేశిత వైద్య పరీక్షల ద్వారా బ్రెయిన్ స్టెమ్ డెత్‌ను నిర్ధారించిన తర్వాత చట్టపరంగా అది మరణంగానే పరిగణించబడుతుందని తెలిపారు.

**ఒక్క దాత.. ఎనిమిది ప్రాణాలకు ఆశ**

బ్రెయిన్ డెత్‌కు గురైన వ్యక్తి నుంచి వైద్యపరంగా అనుకూల పరిస్థితులు ఉంటే గుండె, రెండు మూత్రపిండాలు, కాలేయం, రెండు ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్, చిన్నపేగు వంటి అవయవాలను దానం చేయవచ్చన్నారు. ఒక్క అవయవదాత ద్వారా ఎనిమిది మంది వరకు ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని తెలిపారు. అంతేకాకుండా కార్నియా, చర్మం, ఎముకలు తదితర కణజాలాలను కూడా దానం చేయడం ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు.

**అవయవదానంపై ఇంట్లోనే చర్చ మొదలవ్వాలి**

అవయవదానం చేయాలనే తన నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులకు ముందుగానే తెలియజేయడం అత్యంత ముఖ్యమని డా. రామకృష్ణ సూచించారు. అధికారిక ప్రభుత్వ వ్యవస్థలు, గుర్తింపు పొందిన వైద్య సంస్థల ద్వారానే అవయవదానం, కేటాయింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. రక్తదానంపై సమాజంలో వచ్చిన చైతన్యం మాదిరిగానే అవయవదానంపైనా విస్తృత అవగాహన రావాలని ఆకాంక్షించారు.

**ఆంధ్రప్రదేశ్‌లో వేలాది మంది ఎదురుచూపులు**

ఆంధ్రప్రదేశ్‌లో జీవన్‌దాన్ వ్యవస్థ ద్వారా అవయవదానం, అవసరమైన రోగులకు అవయవాల కేటాయింపు జరుగుతోందని తెలిపారు. 2026 జనవరి, ఫిబ్రవరి కాలంలో 18 మంది బ్రెయిన్ డెడ్ దాతల నుంచి సేకరించిన అవయవాలు 64 మంది రోగులకు ఉపయోగపడినట్లు పేర్కొన్నారు.

**దేశంలో పెరుగుతున్న మార్పిడులు.. దాతలు మాత్రం తక్కువే**

2024లో దేశవ్యాప్తంగా 18,911 అవయవ మార్పిడులు జరిగినట్లు డా. రామకృష్ణ తెలిపారు. వీటిలో 13,476 మూత్రపిండాలు, 4,901 కాలేయం, 253 గుండె, 228 ఊపిరితిత్తుల మార్పిడులు ఉన్నాయని పేర్కొన్నారు. దేశ జనాభా 140 కోట్లకు పైగా ఉన్నప్పటికీ అదే ఏడాది మరణానంతర అవయవదాతలు కేవలం 1,128 మంది మాత్రమే ఉండగా, వారి ద్వారా 3,403 అవయవాలు మార్పిడి అయినట్లు తెలిపారు. 2013లో 4,990గా ఉన్న మొత్తం అవయవ మార్పిడుల సంఖ్య 2024 నాటికి 18,911కు పెరగడం వైద్యరంగంలో పురోగతిని సూచిస్తున్నా, అవసరానికి తగ్గ స్థాయిలో దాతలు ముందుకు రావడం లేదన్నారు.

**మన తర్వాతా మరొకరిలో మన జీవితం**

అవయవ మార్పిడి వైద్యం విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నప్పటికీ దాతల కొరత కారణంగా వేలాది మంది రోగులు ఎదురుచూపుల్లోనే ఉన్నారని డా. రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్రెయిన్ డెత్ అనంతరం అవయవదానంపై కుటుంబాల్లో అవగాహన పెరిగితే మరెన్నో ప్రాణాలు కాపాడవచ్చన్నారు. "మన జీవితం ముగిసిన తర్వాత మన అవయవాలతో మరొకరి ప్రాణం నిలబడితే అంతకంటే గొప్ప దానం మరొకటి ఉండదు. అవయవదానంపై అపోహలు వీడి కుటుంబ సభ్యులతో ముందుగానే మాట్లాడాలి. మరొకరికి జీవితం ఇచ్చే ఈ మహాదానంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని డా. ఎస్.సి.హెచ్.ఎస్. రామకృష్ణ పిలుపునిచ్చారు.



# సామర్లకోట స్టేషన్‌లో 'గంజాయి' కలకలం!

**• 60 కిలోలు స్వాధీనం.. ఐదుగురు మహిళలు అరెస్ట్ • రూ.30 లక్షలకు పైగా విలువ ఉంటుందని రైల్వే పోలీసుల అంచనా**
**• రాయగడ ప్రాంతం నుంచి సరుకు?.. బిట్రగుంటకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి**
**• కిలో రూ.వెయ్యికి కొనుగోలు?.. చిన్న పొట్లాలుగా మార్చి విక్రయిస్తున్నట్లు పోలీసుల సమాచారం**
**• సరఫరాదారు ఎవరు?.. వెనుక మరింత పెద్ద ముఠా ఉందా?.. ఆ దిశగా కొనసాగుతున్న దర్యాప్తు**

**సామర్లకోట, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడటం కలకలం రేపింది. రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి 60 కిలోల గంజాయి స్వాధీనం, ఐదుగురు మహిళల అరెస్టును పేర్కొంటూ బుధవారం వార్తా కథనం కూడా వెలువడింది. రైల్వే స్టేషన్‌లోని రెండు, మూడు నంబర్ల ప్లాట్‌ఫామ్‌ల చివరి ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన మహిళలను పరిశీలించగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించినట్టు రైల్వే పోలీసు వర్గాలు తెలిపాయి.

**ఒక్కసారిగా 60 కిలోలు**

పోలీసుల కథనం ప్రకారం ఐదుగురు మహిళల వద్ద ఉన్న సామగ్రిని పరిశీలించగా సుమారు 60 కిలోల గంజాయి బయటపడింది. దానిని స్వాధీనం చేసుకుని మహిళలను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. పట్టుబడిన గంజాయి బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షలకు పైగా విలువ ఉండవచ్చని అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. అయితే ఇది పోలీసుల ప్రాథమిక అంచనా మాత్రమే కావడంతో, ఖచ్చితమైన విలువను అధికారిక కేసు పత్రాలు, స్వాధీనం నివేదిక ఆధారంగానే నిర్ధారించాల్సి ఉంటుంది.

**బిట్రగుంటకు చెందిన వారిగా గుర్తింపు**

ప్రాథమిక విచారణలో అదుపులోకి తీసుకున్న మహిళలు నెల్లూరు జిల్లా బిట్రగుంట ప్రాంతానికి చెందినవారిగా గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం.




రాయగడ సమీపంలోని ఒక ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి దక్షిణ ప్రాంతాలకు తరలిస్తున్నారా? స్థానికంగా చిన్న పొట్లాలుగా మార్చి విక్రయిస్తున్నారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది.

**కిలో రూ.వెయ్యికి కొనుగోలు చేశారా?**

రాయగడ పరిసర ప్రాంతంలో ఓ వ్యక్తి నుంచి కిలో గంజాయిని సుమారు రూ.1,000 చొప్పున కొనుగోలు చేసినట్లు మహిళలు విచారణలో వెల్లడించారని పోలీసులు చెబుతున్నారు. అనంతరం బిట్రగుంట పరిసర ప్రాంతానికి తీసుకువెళ్లి చిన్న పొట్లాలుగా చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో సమాచారం లభించినట్లు తెలుస్తోంది. ఈ అంశాలు ఇంకా దర్యాప్తు దశలో ఉన్నందున, పోలీసుల అధికారిక తుది నివేదిక వెలువడే వరకు వాటిని నిర్ధారిత వాస్తవాలుగా కాకుండా విచారణలో వెల్లడైన సమాచారంగానే చూడాల్సి ఉంది.

**మహిళలనే రవాణాదారులుగా ఎంచుకుంటున్నారా?**

గంజాయి అక్రమ రవాణాలో రైలు మార్గాలను ఉపయోగిస్తున్న ఘటనలు ఆంధ్రప్రదేశ్‌లో గతంలోనూ వెలుగుచూశాయి. ముఖ్యంగా ఒడిశా ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఇతర రాష్ట్రాలకు రైళ్లలో గంజాయి తరలింపుపై పోలీసులు తరచూ కేసులు నమోదు చేస్తున్నారు. మహిళలపై సాధారణ తనిఖీలు తక్కువగా ఉంటాయనే భావనతో కొందరు అక్రమ రవాణాదారులు వారిని సరుకు తరలింపునకు వినియోగిస్తున్నట్లు పోలీసు వర్గాలను ఉటంకిస్తూ గతంలోనూ కథనాలు వెలువడ్డాయి. సామర్లకోట ఘటనలోనూ ఐదుగురు మహిళలు ఒకేసారి పట్టుబడటం నేపథ్యంలో వీరిని ఎవరు పంపించారు? ప్రయాణ ఖర్చులు ఎవరు భరించారు? సరుకు ఎవరికి చేరాల్సి ఉంది? ఒక్కో ప్రయాణానికి ఎంత చెల్లిస్తున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు దర్యాప్తులో కీలకం కానున్నాయి.

**సరఫరాదారు ఎవరు?**

గంజాయి అందించినట్లు చెబుతున్న వ్యక్తిని గుర్తించడంతో పాటు, ఈ వ్యవహారం వెనుక అంతర్రాష్ట్ర స్థాయి సరఫరా వ్యవస్థ ఉందా అనే కోణంలో రైల్వే పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. రవాణాకు రైలు మార్గాన్నే ఎందుకు ఎంచుకున్నారు? గతంలోనూ ఇదే మార్గంలో సరుకు తరలించారా? బిట్రగుంటలో ఎవరికి సరఫరా చేస్తున్నారు? అక్కడి నుంచి మరెక్కడికి పంపిస్తున్నారు? అనే అంశాలపై విచారణ జరగాల్సి ఉంది. అదుపులోకి తీసుకున్న ఐదుగురు మహిళలను సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు పోలీసులు చర్యలు చేపట్టినట్లు సమాచారం. విచారణ పూర్తయ్యే వరకు వారిపై ఉన్నవి ఆరోపణలే; నేరం నిరూపితమయ్యే వరకు వారిని దోషులుగా పరిగణించరాదు.

ఒక వ్యక్తిని బెదిరించి మోటార్ సైకిల్

# అపహరించిన కేసులో నిందితుడు అరెస్ట్



**కోటనందూరు, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక వ్యక్తిని బెదిరించి 2వేల రూపాయలు, పల్సర్ బైక్ తీసుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కోటనందూరు ఎస్సై టీ రామకృష్ణ తెలియజేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 11:45 గంటల సమయంలో జగన్నాథపురం పెట్రోల్ బంకు వద్ద డబ్బులు ఇవ్వాలని బెదిరించి ప్రాణ భయం కలిగించి రెండు వేల రూపాయలు ఫోన్ పే చేయించుకుని పల్సర్ బైకు ను తీసుకెళ్లినట్లు ఫిర్యాదుదారు మార్తి దొరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12-8-26 బుధవారం ఉదయం 10:30 సమయంలో జగన్నాథపురం రాజులు బాబు గుడి సమీపంలో అనకాపల్లి జిల్లా, నాతవరం మండలం, గన్నవరం మెట్ట గ్రామానికి చెందిన తొమ్మండ్ర జాన్ వయసు 25 సం.లు ఎస్సీ మాదిగ ను అరెస్ట్ చేసినట్లు తెలియజేశారు. ఇతని వద్ద నుండి పల్సర్ బైక్, సాంసంగ్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు, అరెస్టు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి, వైద్య పరీక్షలు నిర్వహించి, కోర్టులో హాజరు పరిచినట్లు తెలియజేశారు. ఇతనిపై తదుపరి విచారణ కొనసాగుతుందని ఎస్సై రామకృష్ణ తెలియజేశారు.

# కోటనందూరులో టిడిపి క్లస్టర్ సమావేశం

**ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమాన్ని పూర్తిచేయాలి - స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి**

**జిల్లా టిడిపి అధికార ప్రతినిధి గాడి రాజబాబు**



**కోటనందూరు ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కోటనందూరులో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ సమావేశం మండల తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ పోతల సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గాడి రాజబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలనపై ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, మండలంలో ఇప్పటికి 32 శాతం పూర్తయిందని అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో నూరు శాతం ఫలితాలు సాధించడానికి ఇప్పటినుండి అందరూ సన్నద్ధం కావాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంకంరెడ్డి రమేష్, పెనుముచ్చు నాగేశ్వరరావు, డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, వాసం నాగేశ్వరరావు, వేగి గోపి, సామినీడి కృష్ణార్జున, యర్రా చిన్న సత్యనారాయణ, బోడపాటి సత్యనారాయణ, ఎల్ ఎస్ ఎన్ మూర్తి, అంకారెడ్డి వెంకట సత్యనారాయణ, బూతు కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన

**22 కళాజాత కార్యక్రమాలు.. 15 రోజుల పాటు ఎల్ఈడీ వాహనంతో ప్రచారం**
**9 వేల గృహాల సందర్శనకు ప్రణాళిక.. ప్రమాద స్థితి తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ సౌకర్యం**
**1097 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలి : డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత**

**కాకినాడ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ ప్రతినిధి న్యూస్ :** హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడంతో పాటు యువతకు వ్యాధి నివారణ, పరీక్షలు, అందుబాటులో ఉన్న వైద్య సేవలపై సమగ్ర సమాచారం అందించేందుకు కాకినాడ జిల్లాలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం-2026 సందర్భంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలు, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిబంధనలు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా. కె. అనిత, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ ఎస్.చలమయ్య కలిసి హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన పోస్టర్లు, కరపత్రాలు, ఆరోగ్య దీపికలను ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

కాకినాడ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు ప్రజలు అధికంగా సంచరించే రద్దీ ప్రాంతాల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 22 కళాజాత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కళాకారుల ప్రదర్శనలు, ప్రజలకు సులభంగా అర్థమయ్యే సందేశాల ద్వారా హెచ్ఐవీ సోకే మార్గాలు, నివారణ చర్యలు, పరీక్షల ప్రాధాన్యతపై అవగాహన కల్పించనున్నారు.

**15 రోజుల పాటు ఎల్ఈడీ వాహనం**

జిల్లాలోని ముఖ్యమైన కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, షాపింగ్ ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో 15 రోజుల పాటు ఎల్ఈడీ వాహనం ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన వీడియోలను ప్రదర్శించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎంపిక చేసిన 22 గ్రామాల్లోనూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాలు తదితర ప్రదేశాల్లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేయనున్నారు.

**విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు**

కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. హెచ్ఐవీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితులు, అపోహలు-వాస్తవాలపై వైద్య నిపుణులతో అవగాహన కల్పించనున్నారు. అలాగే వ్యక్తులు తమకు ఉన్న ప్రమాదభరిత స్థితిని క్యూఆర్ కోడ్ ద్వారా స్వయంగా అంచనా వేసుకునే సౌకర్యాన్ని ఈ కార్యక్రమంలో భాగంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

**9 వేల గృహాల సందర్శన**

ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సుమారు 9 వేల గృహాలను సందర్శించి కుటుంబ సభ్యులకు కరపత్రాలు



అందజేయడంతో పాటు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎవరైనా హెచ్ఐవీ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని భావించినా, సందేహాలు ఉన్నా వారికి పరీక్షలు, సేవలపై సమాచారం అందించేందుకు 1097 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందని తెలిపారు. అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని డా. కె. అనిత, డా. ఎస్. చలమయ్య సూచించారు. జిల్లా స్థాయిలో అవగాహన ర్యాలీలు కూడా నిర్వహించి, ముఖ్యంగా యువతలో హెచ్ఐవీపై ఉన్న అపోహలను తొలగిస్తూ బాధ్యతాయుతమైన ఆరోగ్య ప్రవర్తనపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డా. కె. మహేష్, డీసీహెచ్ఎస్ డా. జి. రామానాయుడు, ఎస్. చంద్రమౌళి, కుమారి పి. మహాలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది, భీమాభాయి మహిళా మండలి ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఐసీటీసీ, ఏఆర్‌టీ, డీఎస్ఆర్‌సీ, టీబీ విభాగాల సిబ్బంది, జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ/ఎయిడ్స్ (దిశా) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లు వేసిన ప్రతి రైతు

# పసల్ బీమా ఇన్సూరెన్స్ చేయించుకోవాలి



**కోటనందూరు, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ :** వరి నాట్లు వేసిన ప్రతి రైతు ఫసల్ బీమా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోటనందూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ పోతల సూరిబాబు తెలియజేశారు. కాకినాడ జిల్లా, కోటనందూరు లో విలేకరులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎలినినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన దృష్ట్యా రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలని, మినుములు, రాగులు, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న, కొర్రలు తదితర పంటలు వేసుకోవాలని సూచించారు. అలాగే పసల్ బీమా ఇన్సూరెన్స్ ఈనెల 15వ తేదీతో ముగుస్తుందని రైతులు త్వరగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సందర్భంగా తెలియజేశారు.

రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో

# అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల కొరడా

**రోడ్లపై అడ్డంగా నిలిపిన వాహనాల తొలగింపు - నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు.. జరిమానాలు**
**ప్రజలు, విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు**



**కాకినాడ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ సిటీ న్యూస్ :** కాకినాడ నగరంలోని రాజీవ్ గృహకల్ప, డెయిరీ ఫామ్, దుమ్ములపేట ప్రాంతాల్లో రోడ్లపై అక్రమంగా వాహనాలను నిలిపి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న వారిపై ట్రాఫిక్-1 పోలీసులు బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎం.కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. రాజీవ్ గృహకల్పతో పాటు డెయిరీ ఫామ్, దుమ్ములపేట ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా నిలిపిన లారీలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలను పోలీసులు గుర్తించి తొలగించారు. ముఖ్యంగా రోడ్లను ఆక్రమిస్తూ వాహనాలను నిలిపివేయడం వల్ల స్థానిక ప్రజలతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను పార్కింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. వాహనదారులు రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపి ఇతరులకు అసౌకర్యం కలిగించవద్దని పోలీసులు సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.అక్రమ పార్కింగ్ సమస్య మళ్లీ తలెత్తకుండా ప్రత్యేక తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ఎస్సైలు పి. కిశోర్ కుమార్, సి.హెచ్. కిషోర్ కుమార్, సి.హెచ్. బోసుబాబు, బి.వి. సత్యనారాయణతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి

**రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం - రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్, భూ రికార్డుల డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్**

**తుని, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ :** భూముల రీసర్వే ప్రక్రియలో రైతులను తప్పనిసరిగా భాగస్వాములను చేయాలని, ముందస్తుగా సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్, భూ రికార్డుల డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. రైతుల వివరాలకు సంబంధించి ఈ-కేవైసీ నమోదు తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. బుధవారం కాకినాడ జిల్లా తుని మండలంలోని తెటగుంట, హంసవరం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూర్మనాథ్ మాట్లాడుతూ రీసర్వేలో గతంలో చోటుచేసుకున్న పొరపాట్లు పునరావృతం కాకుండా పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సర్వే ప్రారంభించే రోజున సంబంధిత రైతు లేదా వారి కుటుంబ సభ్యులు క్షేత్రస్థాయిలో ఉండేలా అధికారులు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. సర్వే పూర్తయిన అనంతరం భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించి, రైతుల సమక్షంలోనే సరిహద్దులను నిర్ధారించాలని స్పష్టం చేశారు. సరైన కొలతలు, భూ వివరాలతో రాజముద్ర పొందుపరిచిన పట్టాదారు పాసుపుస్తకం రైతు చేతికి అందే వరకు ప్రతి దశలోనూ సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సందేహాలు, అభ్యంతరాలు ఉంటే క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

**రీసర్వే 2.0తో మరింత పారదర్శకత**

రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రీసర్వే 2.0 అమలు చేస్తున్నట్లు కూర్మనాథ్ తెలిపారు. రైతులు చూపించిన భూహద్దుల ఆధారంగా ప్రాథమిక వివరాలను నమోదు చేసి, అనంతరం భూ పత్రాలతో సరిపోల్చి నిర్ధారణ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ-కేవైసీ ద్వారా రైతుల వివరాలను ధ్రువీకరించడంతో పాటు ప్రతి దశలోనూ వారికి సమాచారం అందిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో నమోదైన భూవివరాలు, సంబంధిత పత్రాల్లోని వివరాలను రైతుల సమక్షంలో సరిపోల్చడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



**రాష్ట్రవ్యాప్తంగా 2,800 సర్వే బృందాలు**

రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 628 గ్రామాలు, రెండో దశలో 748, మూడో దశలో 729, నాలుగో దశలో 1,645 గ్రామాల్లో రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. అత్యాధునిక సర్వే పరికరాలతో సుమారు 2,800 బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని వివరించారు. ఐదో దశలో రాష్ట్రవ్యాప్తంగా 1,343 గ్రామాల్లో రైతులతో కలిసి రీసర్వే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సర్వే విధానంపై రైతుల నుంచి సానుకూల స్పందన వస్తోందని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు.

**భూవివాదాలు లేని రాష్ట్రం లక్ష్యం**

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు సర్వే, రెవెన్యూ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని కూర్మనాథ్ తెలిపారు. రీసర్వే పూర్తయిన తర్వాత భూయజమానులకు స్పష్టమైన హద్దులు, ఖచ్చితమైన రికార్డులు అందుబాటులోకి రావడం ద్వారా భూవివాదాలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె. శ్రీనివాసు, పెద్దాపురం డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ రుద్రంరాజు కృష్ణంరాజు, తహశీల్దార్ జి.వి.ఎస్. ప్రసాదు, మండల సర్వేయర్ పి. సోమురు, రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో

# 'హర్ ఘర్ తిరంగా' పాదయాత్ర



**కాకినాడ, ఆగస్టు 12, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో బుధవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ జెండాలతో పాదయాత్ర చేపట్టారు. క్యాంపస్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర సమీప ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక గృహాలకు త్రివర్ణ పతాకాలను పంపిణీ చేసి ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంత శ్రీ జాతీయ జెండాలతో కూడిన పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ దేశభక్తి భావంతో జరుపుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడటం దేశం పట్ల ప్రజలకు ఉన్న గౌరవం, అభిమానం, బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యత, జాతీయ సమైక్యత, దేశ సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పాదయాత్రలో విద్యార్థులు జాతీయ గీతాలు ఆలపిస్తూ, దేశభక్తి నినాదాలతో పరిసరాలను హోరెత్తించారు. 'హర్ ఘర్ తిరంగా', 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు జాతీయ జెండాలను అందజేశారు. విద్యార్థుల ఉత్సాహభరిత పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్ ఎం. శ్రీదేవి, డాక్టర్ కె. హరిబాబు, శారీరక విద్యా సంచాలకులు డాక్టర్ బి. రాంగోపాల్, అధ్యాపకులు, జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రజల్లో దేశభక్తి భావాన్ని మరింత పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత, దేశ సేవా స్ఫూర్తిని నింపే ప్రయత్నం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.



# ప్రజల అవసరాలే ప్రాధాన్యం..

## రూ.29 లక్షలతో 12వ డివిజన్‌లో బీటీ రోడ్డు పునర్నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజమహేంద్రవరం నగరంలో పుష్కరాలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా సుమారు రూ.300 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, కొన్ని పనులను పూర్తి చేసి, మరికొన్ని పనులను కొనసాగిస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఒకవైపు మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తూనే, మరోవైపు క్రీడా రంగాన్ని ప్రోత్సహించడం, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం, రివర్‌ఫ్రంట్, అఖండ గోదావరి వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. స్థానిక 12వ డివిజన్ గౌతమి స్కూల్ సమీపంలో రూ.29 లక్షలతో బీటీ రోడ్డు పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రముఖ టీడీపీ నాయకులు కోనేరు మురళి తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం అదే డివిజన్‌లో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆనందం లేదా సంతృప్తి కోసం చేసే సుందరీకరణ మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజలు కోరుకునే విధంగా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కనీస మౌలిక వసతులు కల్పించడమే అసలైన అభివృద్ధి అని స్పష్టం చేశారు. మంచి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల బాధ్యతన్నారు. అందులో భాగంగానే ప్రధాన రహదారులతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న అంతర్గత రోడ్లను కూడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా అధిక పన్నులు చెల్లించే ప్రజలకు కనీస రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోతే వారి ఆవేదనను గుర్తించి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఏ ప్రాంతంలో ఏ పని చేయాలన్నది కూటమి నాయకుల సొంత నిర్ణయం కాదని, ప్రజలు కోరుతున్న పనులకే ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. 12వ డివిజన్‌లో ఇప్పటివరకు రూ.32 లక్షల విలువైన పనులు జరుగుతున్నాయని, సుమారు రూ.95 లక్షలతో సోమాలమ్మ ఆలయం పుంత రోడ్డు పనులు ఎన్‌క్యాప్‌లో టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. మరో రూ.41 లక్షల పనులు ప్రారంభించాల్సి ఉండగా, సుమారు రూ.37 లక్షల పనులను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ డివిజన్‌లో మొత్తంగా సుమారు రూ.2.05 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. 42 డివిజన్లను ఒక యూనిట్‌గా తీసుకుని, ఏ ప్రాంతంలో ఏ అవసరం ఉందో గుర్తించి అక్కడ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరంలోని డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు రూ.140 కోట్లు కేటాయిస్తున్నామని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల సమయంలో చెప్పిన 'ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం' లక్ష్యంలో భాగంగా శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థలను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని పార్కుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే 25 పార్కులను అభివృద్ధి చేశామని చెప్పారు. పార్కుల అభివృద్ధితో వాకర్స్, స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తోందన్నారు. ప్రతి అంశాన్ని ప్రజలతో చర్చించి, వారి అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో నియోజకవర్గంలో రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. కొత్త పెన్షన్లకు ఈ నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపే ఆలోచనలో ఉన్నారని ఎమ్మెల్యే వాసు చెప్పారు. బూరుగుపూడి స్థలం విషయంలో గతంలో ఇచ్చిన హామీలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం భూసేకరణ చేసి, అన్యాయం జరిగిన లబ్ధిదారులకు పట్టాలు అందించే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. బూరుగుపూడి, పరిసర ప్రాంతాలకు సంబంధించి సుమారు 11,345 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, భూమిని చదును చేసి పెగ్ మార్కింగ్ పూర్తి చేసి, అతి త్వరలో సుమారు 11,500 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాలు అందించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నగరంలో లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. 'మీ భద్రత మా బాధ్యత' కార్యక్రమంలో భాగంగా సుమారు కోటి రూపాయల విలువైన లైటింగ్ పరికరాలు, ఇతర సామగ్రిని తీసుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని చెప్పారు. డార్క్ స్పాట్లను తగ్గించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో మరింత లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో సీసీ కెమెరాల నెట్‌వర్క్‌ను విస్తృతం చేస్తున్నామని, ఒకదానికొకటి అనుసంధానమైన సీసీ కెమెరాల వల్ల నేరాలు జరిగినప్పుడు పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితులను గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం కలుగుతోందన్నారు. రాజమహేంద్రవరం సిటీలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిని దాదాపుగా సీసీ సర్వైలెన్స్ పరిధిలోకి తీసుకువచ్చామని తెలిపారు. ఇటీవల జరిగిన ఘటనల నేపథ్యంలో ప్రజలు కూడా ముందుకు వచ్చి తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరిస్తున్నారని, దాతల సహకారంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని పూర్తిస్థాయిలో సీసీ సర్వైలెన్స్ పరిధిలోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్, సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీలు ఆధ్వర్యంలో

## వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమం



**కోరుకొండ, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల రెండో తేదీన వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మక నిర్వహించారు. బుధవారం ఆయన ఆదేశాల మేరకు కోరుకొండలో బ్రహ్మకుమారీలు ఆధ్వర్యంలో ప్రజలకు వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోరుకొండలో వ్యసన విముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో, కాలేజీల్లో విద్యార్థిని విద్యార్థులకు వ్యసన విముక్తి ప్రతిజ్ఞను చేయించి, దానిపై అవగాహన కల్పించారు. ఈ నెల 20వ తారీకు లోగా భారతదేశంలో 10కోట్ల మందితో ఈ వ్యసన విముక్తి ప్రతిజ్ఞను చేయించే బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారీలు పార్వతి,వరలక్ష్మి తదితరులు తెలిపారు . ఈ సందర్భంగా బ్రహ్మకుమారిలు పలు గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్యం, దురు వ్యసనాలపై అవగాహన కల్పించి, వాటి వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. మానసికంగా ప్రశాంతంగా ఉండడానికి మెడిటేషన్ కూడా చేయిస్తున్నారు. ఈ రోజు 5వేల మందితో ఈప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి పార్వతి, వరలక్ష్మి,రాజు,స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను

## తయారు చేయడమే లక్ష్యం

ఫ్రాంచైజీ సంస్థల ప్రతినిధులతో అవగాహన సదస్సు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు తెలిపారు. నగరంలోని మెప్మా కార్యాలయంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు చెందిన ఆసక్తిగల స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రత్యేక వ్యాపార యూనిట్ల ఏర్పాటు అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహక చర్యలు చేపడుతోందన్నారు. ప్రత్యేక ప్రాజెక్టులు, వివిధ ఫ్రాంచైజీ సంస్థల సహకారంతో కొత్త వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకునే మహిళలకు అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఎంబ్రాయిడరీ, నేటివ్ అరకు కాఫీ, టీ టైమ్, చాయ్ రాస్తా, తృప్తి క్యాంటీన్, మోమో నెస్ట్ తదితర ఫ్రాంచైజీ సంస్థల ప్రతినిధులు సదస్సుకు హాజరై తమ వ్యాపార అవకాశాలను సభ్యులకు వివరించారు. స్వయం ఉపాధి కోసం రుణాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ప్రాజెక్టు నివేదికలను ఎలా సిద్ధం చేయాలి, బ్యాంకు రుణాల ప్రక్రియ ఎలా ఉంటుందనే అంశాలపై అవగాహన కల్పించారు. కొత్త వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం తదితర పథకాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నివేదికల తయారీ, రుణ దరఖాస్తుల సిఫారసు తదితర అన్ని దశల్లో మెప్మా అధికారులు సహకరిస్తారని పేర్కొన్నారు.

## పిల్లలకి అందించే పోషకాహార నాణ్యతపై రాజీపడేది లేదు

అంగన్ వాడి కేంద్రాలకు పాలు సమయానికి చేరేలా చర్యలు తీసుకోండి

ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి



**మండపేట టౌన్, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు అందిస్తున్న ఆహారం నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు.బుధవారం మండపేట మండల పరిధిలోని మారేడుపాక అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ అప్పర్ ప్రైమరీ స్కూల్, మండపేట జెడ్పీ హైస్కూల్, ఏడిద అంగన్‌వాడీ కేంద్రం, ఏడిద జెడ్పీ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, చిన్నారులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, నిల్వ సదుపాయాలు, పాలు పంపిణీ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాల లక్ష్యాలు పూర్తిగా నెరవేరాలంటే ఆహార పదార్థాల నాణ్యతపై రాజీ పడకూడదన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు సమయానికి చేరేలా ముందుగానే అవసరమైన ఇండెంట్ పంపించాలని అధికారులకు సూచించారు. చిన్నారులకు అందే పోషకాహారం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థులకు అందుతున్న ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రత అంశాలపై కూడా ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్, జిల్లా పౌర సరఫరాల అధికారి వి. పార్వతి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.ఎన్. జ్యోతి, వెల్ఫేర్ అధికారి బి.శశాంక్, ఎస్సీ వెల్ఫేర్ ఎండీ గయజుద్దీన్, ఏఎస్ఓ నాగాంజనేయులు, ఎంఈఓ, సంబంధిత శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఆ గోతిలో పడితే అంతే..!

- గోకవరం ఆర్టీసీ సమీపంలో ప్రాణాంతకంగా మారిన భారీ గుంత
- కాకినాడ వైపు మలుపు వద్ద ప్రమాదకర పరిస్థితి
- అధికారులు స్పందించకపోవడంపై వాహనదారుల ఆగ్రహం

**గోకవరం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** ఆగస్టు 13 గోకవరం ఆర్టీసీ సమీపంలో కాకినాడ వైపు వెళ్లే మలుపు వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహనదారులు, ప్రయాణికులకు ప్రాణాపాయంగా మారింది. రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై పలుచోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గంలో ఇంత పెద్ద గుంత ఏర్పడినా కనీసం హెచ్చరిక బోర్డు లేదా తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదం జరిగే వరకు ఎదురుచూస్తారా?**

రోడ్డు గుంతలే అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, రాత్రివేళ ప్రయాణించే వాహనాలకు ఈ గుంత తీవ్ర ప్రమాదకరంగా మారిందని అంటున్నారు. "ప్రయాణికుడి ప్రాణం పోయిన తర్వాత రోడ్డు వేయడం ఎందుకు? ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలి. ఎవరికైనా ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరిది?" అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

**ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలి**

ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతను వెంటనే పూడ్చడంతో పాటు, దెబ్బతిన్న రహదారి ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగే వరకు అధికారులు నిద్రపోకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఒకరి ప్రాణాన్ని బలిగొనే పరిస్థితి రాకముందే స్పందించాలి. గుంత పూడ్చడమే కాదు.. రహదారి మొత్తం పరిశీలించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మెర్నిపాడులో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పర్యటన



**మండపేట మండలం, ఆగస్టు 12 విశ్వం వాయిస్ న్యూస్ :** రెండేళ్ల పాలనలో అభివృద్ధి - సంక్షేమం ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా మండపేట మండలం, మెర్నిపాడు గ్రామంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు బుధవారం కూటమి నాయకులతో కలసి పర్యటించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ఈ మేరకు ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో రూ 89.65 లక్షలతో నిర్మించిన డబ్ల్యూబిఎం రోడ్లు, సి.సి రోడ్లు, డ్రైన్లు ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయవరంలో తెదేపా మండల స్థాయి సమావేశం



**రాయవరం, ఆగస్టు 12, విశ్వంవాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల స్థాయి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. వుండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ముఖ్యంగా రాయవరం గ్రామంలోని మెయిన్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే భోగాపురం ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తీసుకొచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు. విమానాశ్రయం అందుబాటులోకి రావడం రాష్ట్ర అభివృద్ధికి మరింత దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ చేపడుతున్న ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, బీఎల్వోలు, నాయకులు, అభిమానులు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా సమావేశంలో చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో రిమ్మలపూడి వేణుగోపాల దొర, వెంకట కృష్ణారెడ్డి, నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, చుండ్రు వీర్రాజు (రాజు), కోట వెంకటరమణ, మతుకుమిల్లి ఉదయభాస్కరరావు, వెదురుపాక పీఏసీఎస్ అధ్యక్షుడు పిల్లి గణేష్, నదురుబాధ ఎంపీటీసీ ఉండవల్లి సుబ్బారాయుడు, మండల సెక్రటరీ నల్లమిల్లి సతీష్ రెడ్డి, దేవు శ్రీను, కొవ్వూరి సత్తిరెడ్డి, సుంకవల్లి గంగరాజు, నున్న ప్రదీప్ కుమార్‌తో పాటు మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ

## బాధ్యతగా మార్చుకోవాలి




**రాయవరం, ఆగస్టు 12, విశ్వంవాయిస్ న్యూస్ :** స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై యువతలో అవగాహన పెంపొందించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్-ఈస్ట్ గోదావరి (ఏపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత పఖ్వాడా-2026 కార్యక్రమాన్ని బుధవారం రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు, యువతకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, తడి-పొడి వ్యర్థాలను వేరు చేయడం, పచ్చదనం పెంపొందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. 'క్లీన్ ఇండియా-గ్రీన్ ఇండియా-హెల్తీ ఇండియా' సందేశంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రామారావు, ఏఎస్ చంద్రశేఖర్ రెడ్డి, మై భారత్ వాలంటీర్ ఎం. మణికంఠ, రామకృష్ణారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి



సమస్యలు తీర్చాలని మొక్కుతూ కులదేవతకు సారె సమర్పణ

రాయవరం గ్రామ ప్రజల మేలుకోరి దేవాంగసంఘం పూజలు



**రాయవరం, ఆగస్టు 12, విశ్వంవాయిస్ న్యూస్ :** దేవాంగుల కులదేవత శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం రాయవరం గ్రామంలోని మఠం వీధిలో ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే ఈ పూజా కార్యక్రమానికి దేవాంగ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. కులదేవత ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుతూ ఈ ఏడాది తొలిసారిగా దేవాంగ కుటుంబాల మహిళలు అమ్మవారికి సారెలు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, జాకెట్లు, చలివిడి, వడపప్పు, మిఠాయిలను సారె రూపంలో సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామదేవతలు, కులదేవతలకు సారెలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు ఇబ్బందుల నుంచి బయటపడాలని కోరుకుంటున్నట్లు దేవాంగ కుల పెద్దలు తెలిపారు. ఇందులో భాగంగా గత వారం రాయవరం గ్రామదేవత పోలమాంబ అమ్మవారికి, పుంతలో ముసలమ్మ తల్లికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ దేవాంగులు శ్రీ చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన సారె ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని దేవాంగ కుల పెద్దలు, కమిటీ సభ్యులు సమన్వయంతో ఘనంగా నిర్వహించారు.



# సర్జరీ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్

### వారికి ప్రత్యేక అభినందనలు తెలిపిన తారక్





టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ కు ఇవాళ (ఆగస్టు 12) సర్జరీ జరిగిన సంగతి తెలిసిందే. కొన్ని రోజుల క్రితం భుజానికి గాయం కావడంతో హైదరాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రిలో బుధవారం తారక్ కు విజయవంతంగా శస్త్ర చికిత్స జరిగింది. గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్‌కు శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగింది. కొన్ని రోజుల క్రితం భుజానికి గాయం కావడంతో బుధవారం (ఆగస్టు 12) సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రిలో తారక్ కు విజయవంతంగా సర్జరీ జరిగింది. ఈ సర్జరీ పూర్తయిన తర్వాత ఎన్టీఆర్ ఆరోగ్యంగా ఉన్నారని కిమ్స్ వైద్యులు ప్రత్యేకంగా హెల్త్ బులిటెన్ కూడా విడుదల చేశారు. ఈ క్రమంలో తన సర్జరీపై స్వయంగా జూనియర్ ఎన్టీఆర్ స్పందించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్)లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు తారక్. 'మీ అందరి నుంచి వెల్లువెత్తిన ప్రేమ, ప్రార్థనలకు ధన్యవాదాలు. నా కోసం మీరు ప్రార్థనలు చేసినందుకు చాలా కృతజ్ఞుడిని. సర్జరీ విజయవంతమైంది. ఇప్పుడు నేను క్షేమంగా ఉన్నాను. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. స్నేహితులు, కుటుంబం, ఫ్యాన్స్ మద్దతు నాకు ప్రతిరోజు బలాన్ని ఇస్తుంది. త్వరలోనే మళ్లీ కలుద్దాం' అని ట్వీట్ చేశారు ఎన్టీఆర్. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి వైద్య బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు తారక్. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్ గా మారింది. అభిమానులు, నెటిజన్లు రియాక్ట్ అవుతున్నారు. ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని పోస్టులు పెడుతున్నారు. కాగా ఎన్టీఆర్‌కు గాయమైనప్పుడు మొదట కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందనుకున్నారు.అయితే గాయం తీవ్రత ఎక్కువగా ఉండడం, భవిష్యత్ లోనూ ఎలాంటి పరిణామాలు తలెత్తకుండా ఉండడానికి సర్జరీ చేయాలని డాక్టర్లు సూచించారు. దీంతో ఎన్టీఆర్‌కు శస్త్ర చికిత్స జరిగింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం డ్రాగన్ సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. కేజీఎఫ్, సలార్ సినిమాలతో పాన్ ఇండియా రేంజ్ లో ఫేమస్ అయిన కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతోన్న ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన లేటెస్ట్ సెన్సేషన్ రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కూడా నటిస్తోందని ప్రచారం జరుగుతోంది.

బాబోయ్.. నెట్టింట గత్తరలేపుతున్న

# సీరియల్ విలన్..

### అమ్మడు ఫోటోలకు నెటిజన్స్ కామెంట్స్ చూస్తే..



తెలుగు బుల్లితెరపై తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా సీరియల్లలో విలన్ పాత్రలతో తనదైన నటనతో పాపులర్ అయ్యింది. ముఖ్యంగా ట్రెడిషనల్ లుక్ లో కనిపిస్తున్న ఈ అమ్మడు.. ఇప్పుడు సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ లుక్కులో కట్టిపడేస్తుంది. ఇంతకీ ఈ అమ్మడు ఎవరో గుర్తుపట్టారా..? తెలుగులో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితమైన నటి జ్యోతిక మునిరత్నం. ఇప్పుడిప్పుడే స్మాల్ స్క్రీన్ పై మంచి గుర్తింపు తెచ్చుకుంది. తన అద్భుతమైన నటనతో, ముఖ్యంగా విలన్ పాత్రలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. ప్రస్తుతం ఆమెకు సంబంధించిన ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి. తక్కువ సమయంలోనే నటిగా అందరి హృదయాలు గెలుచుకుంది. 'గుండెనిండా గుడిగంటలు' సీరియల్‌లోని 'రోహిణి' పాత్రతో ఆమె చేసిన నటనా మాయాజాలం తెలుగు ఫ్యామిలీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. అయితే సీరియల్లో పద్దతిగా ఉండే రోహిణి.. ఇప్పుడు సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ ఫోటోలతో నెట్టింట మెంటలెక్కిస్తుంది. జ్యోతిక కన్నడ బుల్లితెర పరిశ్రమ ద్వారా తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించారు. కన్నడలో అనుభవం సంపాదించుకున్న తర్వాత, ఆమె తెలుగు టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టారు.'కళ్యాణి' సీరియల్‌లో కీలక పాత్ర పోషించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ప్రస్తుతం 'గుండెనిండా గుడిగంటలు' సీరియల్‌లో ఆమె పోషిస్తున్న 'రోహిణి' నెగటివ్ పాత్ర కథకు ప్రధాన ఆకర్షణగా మారింది. ఈ పాత్రలో ఆమె చేసే ప్లాన్స్, విలనిజం ప్రేక్షకులకు కోపం తెప్పించినా, నటిగా ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. జ్యోతిక కర్ణాటకకు చెందిన అమ్మాయి. బెంగళూరులో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని, నటనపై ఉన్న మక్కువతో గ్లామర్ ఫీల్డ్‌లోకి అడుగుపెట్టారు. సీరియల్స్‌లో ఎప్పుడూ చీరకట్టుతో, పద్ధతిగా కనిపించే జ్యోతిక, నిజ జీవితంలో మాత్రం చాలా మోడ్రన్‌గా ఉంటారు. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసే వెస్ట్రన్ ఫొటోషూట్స్ చూస్తుంటే, 'ఈమె నిజంగానే రోహిణీనా?' అని ప్రేక్షకులు ఆశ్చర్యపోతుంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉంటూ తన స్టైలిష్ లుక్స్‌తో ఫ్యాన్స్‌ను అలరిస్తుంటారు. ప్రస్తుతం తెలుగు బుల్లితెరపై క్రేజ్ ఉన్న విలన్ పాత్రధారుల్లో జ్యోతిక ఒకరు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఆమె తన పాత్రల డిమాండ్‌ను బట్టి రోజుకు సుమారు రూ. 15,000 నుండి రూ. 25,000 వరకు పారితోషికం అందుకుంటున్నట్లు అంచనా. కేవలం సీరియల్స్‌కే పరిమితం కాకుండా, భవిష్యత్తులో వెండితెరపై కూడా మంచి పాత్రలు చేయాలని ఈమె ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నటిగా ప్రూవ్ చేసుకున్న జ్యోతిక, సినిమాల్లో కూడా తనదైన ముద్ర వేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం జ్యోతిక షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంటాయి.




# ద 'వాల్'ను బద్దలు కొట్టడం కష్టమే



క్రికెట్ అనగానే భారత అభిమానులకు గుర్తుకొచ్చేది సచిన్ తెందుల్కర్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రికార్డులను సృష్టించిన 'గాడ్ ఆఫ్ క్రికెట్'. కానీ, అతడికే సాధ్యం కాని కొన్ని ఘనతలను తన ఖాతాలో వేసుకొన్నాడు 'ద వాల్'. టెస్టు క్రికెట్‌లో బౌలర్లకు గోడలా నిలబడిపోయాడు. అతడి ప్రస్తావన లేకుండా భారత టెస్టు క్రికెట్ చరిత్ర ఉండదంటే అతిశయోక్తి కాదు. అతడే మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్. శ్రీలంకతో భారత్ టెస్టు సిరీస్ ఆడనున్న నేపథ్యంలో.. ఎవరికీ సాధ్యం కాని ద్రవిడ్ ఫీట్‌లపై ఓ లుక్కేద్దాం..

**అత్యంత ఓపికగా..**

టెస్టు క్రికెట్ అంటేనే ఓపికతో కూడిన గేమ్. ప్రత్యర్థి బౌలర్లు ఎంత రెచ్చగొట్టినా ఏకాగ్రత తప్పకూడదు. ఇప్పటి కుర్రాళ్లలో ఈ లక్షణం కాస్త తక్కువే. కానీ, గత తరం ప్లేయర్లు మాత్రం ఆ నైపుణ్యాన్ని ఒంటబట్టించుకున్నారు. సునీల్ గావస్కర్ నుంచి మొన్నే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానే వరకూ టెస్టులకు ఇచ్చిన మర్యాదను చూశాం. వీరందరిలోకి రాహుల్ ద్రవిడ్ తీరే భిన్నం. మిగతా ఆటగాళ్ల ఏదో కాసేపు ఆడేద్దాములే అని గివ్‌అప్ ఇచ్చేస్తారు. కానీ, ద్రవిడ్ మాత్రం అలా కాదు. రోజులతరబడి ఆడుతూనే ఉంటాడు. తన మొత్తం కెరీర్‌లో 286 ఇన్నింగ్స్‌ల్లో అతడు క్రీజ్‌లో పాతుకుపోయిన సమయం 44,152 నిమిషాలు. అంటే దాదాపు 736 గంటలు. సచిన్ మాత్రమే 41,304 నిమిషాలతో (సుమారుగా 688 గంటలు) రెండో స్థానంలో నిలిచాడు. అదీనూ 329 ఇన్నింగ్స్‌లను సచిన్ తీసుకొన్నాడు.

**బంతిని ఎదుర్కోవడమంటే..**

రాహుల్ ద్రవిడ్ - షోయబ్ అక్తర్ మధ్య పోరు భలే ఆసక్తికరంగా ఉండేది. అక్తర్ దాదాపు బౌండరీ లైన్ వద్ద నుంచి పరుగెడుతూ వచ్చి 145 కి.మీ వేగంతో బంతులేస్తే ద్రవిడ్ అలవోకగా అడ్డుకొనేవాడు. ఆ సమయంలో అక్తర్ నిరుత్సాహంతో ఉడికిపోయేవాడు. అక్తర్ మాత్రమే కాదు.. ప్రపంచంలోనే టాప్ బౌలర్లందరినీ ద్రవిడ్ ఇలానే నిలువరించాడు. అందుకేనేమో ప్రపంచ టెస్టు క్రికెట్‌లో ఎక్కువ బంతులు ఆడిన ఆటగాడిగా ఇప్పటికీ ద్రవిడ్ రికార్డు చెక్కు చెదరలేదు. అత్యధిక పరుగులు చేసిన ఘనత సచిన్ తెందుల్కర్ (15,921) పేరిట ఉంటే.. ఎక్కువ బంతులు ఆడిన ఆటగాడు మాత్రం ద్రవిడే. తన 16 ఏళ్ల కెరీర్‌లో 164 టెస్టులు ఆడిన ద్రవిడ్ 31,258 బంతులు ఎదుర్కొని 13,288 రన్స్ రాబట్టాడు. ప్రస్తుత తరం క్రికెటర్లలో జో రూట్ (24,534 బంతులు) మాత్రమే ఆ దిశగా ఉన్నాడు.

**ఇక మూడోది..**

టెస్టుల్లో శతక భాగస్వామ్యాలు నిర్మించడమంటే తేలికైన విషయం కాదు. యాంకర్ పాత్ర పోషిస్తూనే పరుగులు రాబట్టాలి. కానీ, సహచరులతో కలిసి అత్యధిక సెంచరీ పార్టనర్‌షిప్‌ల్లో నిలిచిన ఏకైక ఆటగాడు రాహుల్ ద్రవిడ్. తన కెరీర్‌లో 88సార్లు 100 అంతకంటే ఎక్కువ పరుగులను జోడించాడు. సచిన్ తెందుల్కర్‌కూడా తన కెరీర్‌లో 86 సార్లు మాత్రమే శతక భాగస్వామిగా ఉన్నాడు. ఇక వీరిద్దరూ కలిసి టెస్టుల్లో 20సార్లు సెంచరీ పార్టనర్‌షిప్‌లను నిర్మించారు.

**చివరిగా:** క్రికెట్ నైపుణ్యాలకు పరీక్ష పెట్టే టెస్టుల్లో రాణించాలంటే రాహుల్ ద్రవిడ్ బాటలో పయనించాల్సిందే. ఎంత రెచ్చగొట్టినా ఏకాగ్రత కోల్పోకూడదు. సంయమనంతో ఆడాలి. సుదీర్ఘ ఫార్మాట్‌లో అద్భుత ఘనతలు సాధించిన రాహుల్ ద్రవిడ్ మైదానంలో స్లెడ్జింగ్ చేసిన దాఖలాలు చాలా తక్కువ. ఆటగాడిగానే కాకుండా.. ప్రధాన కోచ్‌గానూ భారత జట్టుకు సేవలందించాడు.

# ఈ ఆగ్రహానికి కారణమేంటో అర్థం కావట్లేదు : పీవీ సింధు



ఆగస్టు 17 నుంచి ప్రారంభంకానున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఇండియా ఓపెన్ సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సారి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రత్యేక చర్యలు చేపట్టింది. కోతుల బెడదను నివారించేందుకు లంగూర్ల (కొండ ముచ్చులు) శబ్దాలను అనుకరించే ముగ్గురు నిపుణులను నియమించింది. ఈ చర్యపై సోషల్ మీడియాలో కొందరు వ్యంగ్యంగా స్పందించగా వారికి భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు కౌంటర్ ఇస్తూ నిర్వాహకులు చేపట్టిన ప్రయత్నాలను మెచ్చుకున్నారు. 'ఈ పరిష్కారాన్ని చూసి కొందరు నవ్వొచ్చు. కానీ, వారి (బీఏఐ) కృషిని అభినందించాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. సింధు పోస్టుకు కొంతమంది నెటిజన్లు 'కోతుల సంగతి పక్కన పెట్టు.. ముందు టోర్నమెంట్‌లో బాగా ఆడటంపై దృష్టిపెట్టు" అని కామెంట్లు పెట్టారు. ఆ కామెంట్లపై సింధు స్పందించారు. టోర్నమెంట్‌లో మంచి ప్రదర్శన చేయడానికి వంద శాతం కృషి చేస్తానని.. కానీ ఈ ఆగ్రహానికి కారణమేంటో అర్థం కావట్లేదని పేర్కొన్నారు. వింబుల్డన్‌లో కోర్టులను పావురాలు రెట్టలతో పాడు చేయకుండా ఉండేందుకు డేగను సెక్యూరిటీగా పెట్టారని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడైనా ప్రధాన క్రీడా ఈవెంట్లను నిర్వహించేటప్పుడు స్థానికంగా కొన్ని సవాళ్లు ఉంటాయన్నారు. టోర్నమెంట్‌కు ఎలాంటి ఆటంకాలు కలగొద్దనే ఉద్దేశంతో కోతుల బెడదను నివారించేందుకు చేసిన ఏర్పాటును ఎందుకు చర్చనీయాంశం చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదని సింధు పేర్కొన్నారు.

# ఇటీవలే క్రికెట్‌కు గుడ్‌బై.. కొత్త పాత్రలోకి అజింక్య రహానే



భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానే కొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవలే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. టీమ్ఇండియా తరఫున పదిహేనేళ్లపాటు క్రికెట్ ఆడాడు. ఐపీఎల్‌లోనూ ప్రాతినిధ్యం వహించాడు. ఆటకు గుడ్ బై చెప్పిన తర్వాత ఏం చేస్తాడనేదానికి సమాధానం దొరికింది. మరో మూడు రోజుల్లో శ్రీలంక - భారత్ జట్ల మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు వ్యాఖ్యాతగా అజింక్య రహానే వ్యవహరించనున్నాడు. ఈ మేరకు రహానే, సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ సీఆర్‌వో, బిజినెస్ హెడ్ రాజేశ్ కౌల్ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. తమ కామెంట్రీ ప్యానల్‌లోకి రహానేను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు రాజేశ్ తెలిపారు. "భారత్ - శ్రీలంక జట్ల మధ్య టెస్టు సిరీస్‌కు వ్యాఖ్యాతగా అరగేంట్రం చేయనుండటం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది. క్రికెట్‌లో టెస్టు ఫార్మాట్‌కు తిరుగులేదు. భారత్ తరఫున కొన్నేళ్లు టెస్టు మ్యాచులు ఆడా. ఇప్పుడు ఆటను మరో కోణంలో చూడబోతున్నా. నా అనుభవాలు, ఆటలోని మలుపులను అభిమానుల ముందుకు తీసుకొస్తా. నా బ్రాడ్‌కాస్ట్ అనుభవం ఫ్యాన్స్‌ను అలరిస్తుందని అనుకుంటున్నా" అని రహానే వెల్లడించాడు.

**రెండో టెస్టుకూ సుందర్ దూరం?**

గాయం కారణంగా వాషింగ్టన్ సుందర్‌ను శ్రీలంకతో తొలి టెస్టుకు ఎంపిక చేయలేదు. అయితే, కోలుకుని వస్తాడనే అంచనాలతో రెండో మ్యాచ్ స్క్వాడ్‌లో అవకాశం కల్పించింది మేనేజ్‌మెంట్. కానీ, రెండో టెస్టులోనూ అతడు ఆడే అవకాశాలు తక్కువేనని సమాచారం. ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఆగస్టు 23 నుంచి మొదలయ్యే రెండో మ్యాచ్‌కు కొలంబో వేదికగా నిలవనుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com